ఆటవిక రాజ్యం

సుంకరి రాంప్రసాద్

రాత్రి బాగా పొద్దు పోయింది.

చీకటి మరింత చిక్కబడటంతో, బిక్కు, బిక్కు మంటూ యిక వుండలేక చుక్కలు కూడా పక్కలు చేరే వేళ.

నల్లని పసిఫిక్ సముద్ర జలాలను చీల్చుకుంటూ రాయంచలా వయ్యారంగా దూసుకుపోతూంది కొలంబియా. సకల సదుపాయాలతో నూరుమంది యాత్రికులు హాయిగా ప్రయాణించగల ఆ మినీ లగ్జూరియస్ ప్యాసింజర్ స్టీమర్, చిలీలోని వాలివియా రేవునుండి బయలుదేరింది.

దక్షిణ అమెరికా ఖండంలో నైరృతితీరాన సన్నగా, పొడుగ్గా తీగెలా ఉండే దేశమే చిలీ. ఆ దేశానికి దక్షిణ దిక్కులో వందల సంఖ్యలో వ్యాపించి వున్నాయి చిన్న చిన్న దీవులు.

చోనాస్ దీవుల సముదాయంగా పిలువబడే ఆ దీవులు సహజసిద్ధమైన ప్రకృతి సౌందర్యానికి కాణాచులు.

అందమైన ఆ దీవులకు విహారయాత్రలకోసం ఒక్క చిలీ దేశస్థులే గాక, పెరూ, అర్జెంటైనా, ఉరుగ్వే, బ్రెజిల్ మొదలగు పొరుగు దేశాలనుండి కూడా యాత్రికులు వస్తూంటారు. వారి కోసం కొన్ని విహార నౌకలను కూడా చిలీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

అలాంటి ఒక విహార నౌకే కొలంబియా.

తమకు కేటాయింపబడ్డ కేబిన్‌లలో వెచ్చగా పడుకుని వున్నారు ఆ నౌకలోని కొందరు యాత్రికులు. షిప్ డెక్ మీద కుర్చీలలో కూర్చుని, రాత్రంతా స్కాచ్ సేవిస్తూ నిషా పూర్తిగా నరాలకు ఎక్కాక, లేచి కాబిన్‌లోనికి వెళ్ళే ఓపిక లేక, అలా....ఆ డెక్ మీదే మత్తుగా వాలి పోయారు మరికొందరు ప్రయాణీకులు.

నీలాకాశంలోని చుక్కలన్నింటినీ ఒక్క చోటే ప్రోగేసినట్లు నల్లని సంద్రంలో విద్యుద్దీప కాంతులతో వెలిగిపోతూంది ఆ విహార నౌక.

తెరచాప స్తంభం ప్రక్కనున్న తన కేబిన్‌లోనుండి పైకి వచ్చాడు ఆ షిప్ కెప్టెన్ విలియమ్స్. ఆవులిస్తూ బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు. చుట్టూ పరకాయించి చూశాడు.

కొలనులోనికి జలకాలాడటానికి దిగిన మత్తగజాల గుంపులా వున్నాయనుకున్నా డతడు దూరంగా నల్లని గుట్టల్లా కన్పిస్తున్న దోనాన్ దీవులను చూస్తూ.

సరిగ్గా అప్పుడే....వున్నట్లుండి షిప్‌లోని దీపాలన్నీ ఆరిపోయాయి. అంతా కటిక చీకటి. కన్ను పొడుచుకున్నా యేమీ కనిపించలేదతడికి.

ఆ షిప్‌లో కాస్త మెలకువగా వున్నవారు గాబరాగా లేచి కూర్చున్నారు. కాని, ఏం జరిగిందో,

యేమిటో యెవరికీ యేమీ అర్థం కాలేదు.

పదిహేను నిమిషాల తరువాత మళ్ళీ మామూలుగా దీపాలు వెలిగాయి.

కరంట్ యెందుకు ఫెయిలయిందో చూడటానికి, జనరేటర్ రూమ్‌కు హుటాహుటిని వెళ్ళాడు కెప్టెన్ విలియమ్స్. కాని, జనరేటర్ ఆపరేటర్ కనిపించలేదతడికి. జనరేటర్ మామూలుగానే పని చేస్తూంది.

అయితే కనిపించకుండా మాయమైంది ఒక్క ఆపరేటర్ మాత్రమే కాదని, ఓడ సిబ్బందిలోని మరో ఇద్దరు సెయిలర్స్, ముగ్గురు ప్రయాణీకులు, మొత్తం ఆరుగురు వ్యక్తులు అదృశ్యమయ్యారని, వారితో పాటే కొంత విలువైన సామగ్రి కూడా మాయమైందని తెలిసేసరికి, ఓడలో కలకలం ప్రారంభమయింది.

ఆ తరువాత ఎంత ప్రయత్నించినా, వారి ఆచూకీ గాని, కనీసం వారు ఎలా అదృశ్యమయ్యారో గాని, ఎవ్వరూ తెలుసుకోలేక పోయారు.

2

"పసిఫిక్ మహాసముద్రంలో దోనాన్ దీవులకు సమీపంగా ప్రయాణిస్తున్న ఓడలోని మనుష్యులు విచిత్రంగా అదృశ్యమవుతున్నారు. వారితో పాటు యెంతో విలువైన సామగ్రి కూడా మాయమవుతుంది.

కేవలం నెలరోజులలో పదిహేను ఓడలలోని వ్యక్తులు, కొన్ని మిలియన్ డాలర్ల విలువ చేసే సామగ్రితో సహా అదృశ్యమయ్యారు.

చిలీ ప్రభుత్వపు రహస్య గూఢచారి విభాగానికి సైతం అంతుచిక్కని ఈ దోనాన్ దీవులలోని రహస్యం ఏమిటి?

ఎవరు చేస్తున్నారిదంతా?

సముద్రంలో ఓడలు ప్రయాణిస్తూండగానే మంత్రం వేసినట్టు అందులోని వ్యక్తులు, సామాగ్రి మాయమౌతున్నారంటే.... ఇది మనుష్యులకు సాధ్యమా అన్న అనుమానం వస్తూంది.

మనుష్యులు కాకుంటే.... ఎవరా అదృశ్య శక్తి?"

"ట్రాష్!"

చదువుతున్న న్యూస్ పేపర్‌ను టీపాయ్ మీదకు గిరవాటు వేస్తూ అన్నాడు గోవర్.

అతడి వంక నవ్వుతూ చూశాడు లాంబ్.

"యస్ లాంబ్! నేను నమ్మను. దోనాన్ దీవుల గూర్చి ఈ పత్రికల వాళ్ళు గోరంతల్ని కొండంతలు చేస్తున్నారు. అయినా ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో యేదో అదృశ్యశక్తి, మనుషుల్ని మాయం చేస్తుందని కాకమ్మ కథలు చెబుతున్నారంటే—ఓహ్!"

"ఏమో గోవర్ అది నిజమే నేమో!"

"అంటే.... దీనిని నీవు నమ్ముతున్నావా?"

"ఏం? నమ్మకూడదా!"

"నిజాన్ని నమ్మితే తప్పులేదు ఫ్రెండ్! కాని, ఇలాంటి కథలను...."

"ఇది కథ కాదు గోవర్."

"నిజమే అయితే యెవరా అదృశ్యశక్తి?"

"అది తెలియకనే ఈ ముసుగులో గుద్దులాట."

"అయితే ఆ రహస్యమేదో మనం తెలుసుకుందాం."

"గోవర్....!"

"యస్ లాంబ్! మనమూ ఒకసారి ప్రయత్నిస్తే తప్పేమిటి? జస్టు మనం దోనాన్ దీవులకు పిక్నిక్

వస్తున్నాం అనుకో."

గోవర్ కళ్ళలోని పట్టుదలను చూసి నెమ్మదిగా తలాడించాడు లాంబ్.

గోవర్ ఒక నిర్ణయానికి వచ్చాడంటే ఎంత రిస్క్ చేసైనా ఆ పని చేసితీరతాడని లాంబ్‌కు బాగా తెలుసు.

లాంబ్, గోవర్ మంచి స్నేహితులు. ఓషనాలజీ ప్రధాన పాఠ్యాంశంగా పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న విద్యార్థులు వారు. తమ పాఠ్యపుస్తకాలలో దోనాన్ దీవుల గురించి క్షుణ్ణంగా చదువుకున్నారు వారు.

కొన్ని వందల సంఖ్యలో వ్యాపించి వున్న ఆ దోనాన్ దీవులలో మానవ సంచారం వున్నది ఒకే, ఒక్క దీవిలోనని, మిగిలిన దీవులు భయంకర క్రూర మృగాలతో నిండిన దుర్గమారణ్యాలనీ, వాటిలోనికి ప్రవేశించడమంటే మృత్యుగహ్వరంలో అడుగు పెట్టడమేనని వారికి తెలుసు.

దోనాన్ దీవులకు వచ్చే యాత్రికులుకూడా మానవ సంచారం వుండే ఆ ఒక్క దీవికి మాత్రమే వెళతారు.

తమ సత్యాన్వేషణను ఆ దీవినుండే ప్రారంభించాలని నిశ్చయించుకున్నాడు గోవర్.

వారు ఆ రోజు రాత్రే దోనాన్ దీవులకు ప్రయాణమయ్యారు.

3

తన ఎదురుగా కూర్చున్న ఇద్దరు యువకుల వంక అర్ద్రంగా చూశాడు గ్రాహమ్ పాల్.

దోనాన్ దీవులలో మానవ సంచారంగల దీవిలో ఒక రోమన్ కేథలిక్ చర్చి వుంది. పురాతనమైన ఆ చర్చిలోని పాస్టరే.... గ్రాహమ్ పాల్.

అత్యంత ప్రాచీనమూ, నిగూఢమూ అయిన దోనాన్ దీవుల గురించి అంతో, ఇంతో వివరంగా తెలిసిన వ్యక్తి గ్రాహమ్ పాల్ ఒక్కరే.

చిలీ ప్రభుత్వ గూఢచారులు సైతం, దోనాన్ దీవులకు సంబంధించిన తమ పరిశోధనలో ఆ మతాధికారిని సంప్రదించి, అతడి సలహాలు తీసుకున్నారు.

"మీరు అనవసరంగా కోరి ప్రమాదాన్ని తెచ్చుకుంటున్నారేమో బాబూ" అన్నాడు పాల్.

అతడి కళ్ళల్లో కరుణ రసం ఉట్టిపడుతూంది. అతడి గొంతు మెత్తగా, మార్దవంగా వుంది.

ఆరడుగుల దేహం, విశాలమైన ఫాలం, వెండిలా మెరిసే నిడుపాటి గడ్డం, తెల్లగా, స్వచ్ఛంగా, ముట్టుకుంటే మాసిపోతాయా అన్నట్లుండే వస్త్రాలలో.... స్వర్గం నుండి దిగివచ్చిన దేవదూతలా వున్నాడు గ్రాహమ్ పాల్.

అతడివంక గౌరవంగా చూసాడు గోవర్.

"లేదు ఫాదర్! ఈ ప్రయత్నంలో వెనుకంజ వేసే ప్రసక్తి లేదు. ఎలాగైనా ఆ దోనాన్ దీవుల రహస్యం ఛేదించాలి" దృఢంగా పలికింది గోవర్ గొంతు.

"కాని... ఈ ప్రయత్నంలో...."

"మా ప్రాణాలు పోయినా పర్వాలేదు ఫాదర్!"

"ఎందుకా మొండి పట్టుదల బిడ్డా?"

"మొండి పట్టుదల కాదు ఫాదర్ చిలీ దేశ పౌరులుగా ఇది మా కర్తవ్యం.

ఈ నెలరోజాలలో కొన్ని వందలమంది మాయమయ్యారు. ఏమయ్యారు వారంతా? చనిపోయారా? చనిపోయివుంటే వారి శవాలో లేక అస్థికలో మనకు

అర్థ్యమవ్వాలి కదా!

లేదు బ్రతికి వుంటే—వారంతా ఎక్కడ ఉన్నట్లు? వారంతా నా బంధువులో, స్నేహితులో కాకపోవచ్చు. కాని, నా దేశ పౌరులు కారా? వారి కుటుంబ సభ్యులు వారికోసం విలపించటంలేదా?

ఇది నా ఒక్కడి సమస్య కాకపోవచ్చు. కాని మొత్తం జాతికి సంబంధించిన సమస్య ఇది. అందుకే ఈ సమస్యా పరిష్కారానికి ప్రయత్నించడం నా బాధ్యతగా భావిస్తున్నాను." ఆవేశంగా అన్నాడు గోవర్.

అతడి భుజాన్ని అనునయంగా తట్టాడు ఫాదర్ పాల్.

"వెల్ డన్ మై బాయ్! దేవుని పుత్రునివలె పరుల కొరకు ప్రాణములైనను యిచ్చుటకు సిద్ధపడుచున్నావు. ప్రభువు నిన్ను సర్వదా రక్షించుగాక!"

చేయెత్తి మనసారా దీవించాడు పాల్.

అంతవరకూ మౌనంగా, ప్రేక్షకునిలా వున్న లాంబ్ మొదటిసారిగా పెదవులు విప్పాడు.

"యిక చెప్పండి ఫాదర్ దోనాన్ దీవుల గురించి. మీరు చెప్పే, మీకు తెలిసిన అతి చిన్న విషయంకూడా మా ప్రయత్నంలో మాకెంతగానో సహకరించవచ్చు."

లాంబ్ వంక చురుగ్గా చూశాడు పాల్.

స్తబ్దంగా పడివుండి, ఉన్నట్లుండి ఒక్కసారిగా, మెరుపు వేగంతో శత్రువుపై ఎటాక్ చేసే కొండచిలువ గుర్తుకువచ్చింది అతడికి లాంబ్‌ను చూస్తే, ఎందుకో.

ఆ తరువాత సుమారు గంటన్నరసేపు జరిగింది వారి మధ్య సంభాషణ.

దోనాన్ దీవుల గురించి తనకు తెలిసిన విశేషాలను

పూసగుచ్చినట్లు వివరించి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలనుకూడా చెప్పాడు పాల్. అక్కడక్కడ తనకు వచ్చిన సందేహాలను అడగసాగాడు గోవర్. లాంబ్ మాత్రం మౌనంగా వారి మాటలను ఆలకించసాగాడు.

4

సంధ్యారుణ కాంతిలో దోనాన్ దీవులు పాటలి వర్ణాన్ని పులుముకుంటున్నాయి.

ఒక చిన్న దీవి ఒడ్డునే సముద్ర జలాలలో నెమ్మదిగా ప్రయాణిస్తూంది ఒక చిన్న ఫిషింగ్ బోట్. సముద్ర జలాలు ఆ దీవుల మధ్య పాయలుగా ప్రవహించటంచేత, కెరటాల ఉధృతం లేక ప్రశాంతంగా వుంది. దీవికి, దీవికి మధ్య సన్నని నదీ పాయలా వుంది నల్లని సముద్రం.

బోట్‌లో ముందువైపు కూర్చుని బలంగా తెడ్లు వేస్తున్నాడు లాంబ్. చేతిలోని చిన్న చేపల వలను సముద్రంలోనికి విసిరాడు గోవర్ అతడి కళ్ళుమాత్రం నలుదిక్కులా పరిశీలనగా చూస్తున్నాయి. చూడటానికి చేపలు పట్టుకొనే పల్లెవాళ్ళలా వున్నారు వారు.

మోకాళ్ళదాకా వుండే ట్రౌజర్స్, మురికి బనియన్, తలపై ఖర్జూరపు ఆకులతో నేసిన పెద్ద, పెద్ద టోపీలూ అచ్చంగా లాటిన్ అమెరికన్ పల్లెవాసుల్లాగానే వున్నారు వారు.

ఒక్కొక్క దీవిని దాటుకుంటూ, వారు ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఉదయంనుండి, సాయంత్రంవరకూ నిర్విరామంగా కొనసాగింది వారి ప్రయాణం. కాని అంతవరకూ ఒక్క మనిషి కూడా వారికి కనిపించలేదు.

ఏపుగా, ఎత్తుగా పెరిగిన పచ్చని తోటలూ, పచ్చని ఆకాశంలో మెరిసే తారల్లా, విరిసిన రంగు రంగుల అడవి

పూలూ, గాలివాటున వచ్చి మత్తెక్కించే వాటి సౌరభమూ, తీరం వెంబడి గుంపులు గుంపులుగా యెగిరే తెల్లని సీ గల్స్. కనులవిందు చేస్తున్న దోనాన్ దీవుల అందాలను చూస్తూ వారు తమ్ము తామే మరచిపోయారు.

ఓ ప్రక్క సంధ్య చీకట్లు క్రమ్ముకుంటుంటే, అప్పుడు వారికి కాలమూ, గమ్యమూ గుర్తుకు వచ్చాయి. అప్పుడు అర్థమయింది వారికి ఆ దీవులెందుకంత ప్రమాదభరితమైనవో.

“దోనాన్ దీవులు ఒక పద్మవ్యూహంలాంటివి. కొన్ని వందల సంఖ్యలో చిన్న, చిన్నవిగా వ్యాపించిన ఆ దీవుల మధ్యకు ఒకసారి ప్రవేశిస్తే, మరలా తిరిగిరావడం అన్నది సామాన్యమైన విషయంకాదు. ఓ విధంగా అసాధ్యమేమో!

అక్కడనుండి చూస్తే, మనకు అన్ని దీవులూ ఒకే లాగ కన్పిస్తాయి. కానీ ఒక మార్గాన్ని యెన్నుకొని ప్రయాణిద్దామంటే అది త్రిప్పి, త్రిప్పి, తిన్నగా మళ్ళీ యింకో చక్రబంధం లోనికి ప్రవేశపెడుతుంది. అలా, అక్కడికక్కడే ఆ దీవులమధ్యే తిరగడం తప్పించి బయటపడే మార్గం కన్పించదు.

కొన్ని రోజులు గడిచేసరికి దిక్కుతోచక, మార్గం కానరాక మనకు పిచ్చెక్కినట్లు అవుతుంది. ముఖ్యంగా, దోనాన్ దీవుల మధ్యకు సాహసించి యెవరూ రాక పోవడానికి కారణం ఇదే.”

వారికి అకస్మాత్తుగా ఫాదర్ పాల్ అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

“అంటే దారీ, తెన్నూ లేక తాము అలా ఆ దీవుల మధ్య తిరుగుతూ....ఆకలి, దప్పులతో మాడి చావ

వల్సిందేనా!"

ఆ ఊహకే వారు భయంతో సన్నగా వణికిపోయారు. ఆ అడవిలో యెక్కడో యేదో పక్షి వికృతంగా అరిచిన ధ్వని. తెడ్లు వేస్తున్న లాంబ్ ఒక్క క్షణం తెడ్లు వేయటం ఆపి చెవులు రిక్కించాడు. మొదటి పక్షికూతకు బదులుగా మరో పక్షికూత వినిపించింది. ఆ తరువాత మరొక పక్షి. దానికి సమాధానమిస్తూ మరొకటి. ఇలా ద్వీపం నలు దిక్కులా ఒకదాని తరువాత ఒకటిగా పక్షికూతలు విని పించాయి.

ఎందుకో ఆ కూతలు అసహజంగా అనిపించాయి లాంబ్ కు. అతడు సాలోచనగా నొసలు చిట్లించాడు. సరిగ్గా రెండు నిమిషాల తరువాత గుర్తుకు వచ్చింది అతడికి... ఆ కూతలేమిటో!

"య్యెస్ ....అవే సందేహంలేదు" అనుకున్నాడతడు.

ఈజిప్టులోని స్త్రీలు రెండు పెదవుల మధ్య చూపుడు వ్రేలునూ, మధ్య వేలునూ వుంచి....తు....ర్....ర్....ర్ మంటూ ఒక విచిత్రమైన శబ్దం చేస్తారు. అది వినడానికి అచ్చం ఒక పక్షి వికృతంగా అరచినట్లే వుంటుంది.

తమ ప్రియతమ నాయకుడు చనిపోయినప్పుడు విషా దంతోనూ, తమ మగవారు యుద్ధభూమికి వెళుతున్నప్పుడు ఉత్తేజంతోనూ....ఈజిప్టు స్త్రీ గొంతుల్లాలు చేసే వింత ధ్వనులివి.

"ఎక్కడో ఆఫ్రికా ఖండంలో వినిపించాల్సిన ఈ ధ్వనులు ఇక్కడ లాటిన్ అమెరికాలో వినిపించడ మేమిటి" అని అనుకున్నాడతడు.

తను ఒకవేళ భ్రమపడ్డానేమో అన్న సందేహం మొలకెత్తింది అతడి మనసులో. ఏదో తెలియని అనీజీ

నెన్‌ను ఫీలవుతున్నారు వారు. ఒకరి నొకరు చూసుకున్నారు బేలగా.

అదే క్షణంలో వారి ఫిష్ బోటు చుట్టూ వున్న సముద్రజలాలలో చిన్న కదలిక యేర్పడింది. ఏమిటా అని చూసారు వారు.

నల్లని సముద్ర జలాలను చీల్చుకుంటూ నెమ్మదిగా పైకి వస్తున్నాయి నాలుగు ఆకారాలు. ఒక్క క్షణం పాటు అవి యేమిటో వారికి అర్థంకాలేదు.

మసక చీకటిలో అస్పష్టంగా కనిపిస్తున్న ఆ ఆకారాల వంక అచేతనులై చూస్తూ వుండిపోయారు వారు.

అప్పుడు వినవచ్చాయి వారికి గుండెలను జలదరించే వికృతమైన నవ్వులు. ఆ నవ్వుతున్నది ఆ ఆకారాలేనని గ్రహించడానికి వారికి రెండు క్షణాలు పట్టింది. అప్పటికి ఆ ఆకారాలు నీళ్ళలోనుండి పూర్తిగా పైకి వచ్చాయి.

నల్లని కారునలుపు దేహాలు. పొడవుగా భుజాల మీదకు వ్రాలుతున్న జడలు కట్టిన జుత్తు, మెడలో రంగు రంగుల పూసల పేర్లు, ముఖాన్ని మరింత వికృతం చేస్తూ పెట్టబడ్డ రంగు, రంగుల బొట్లూ, చేతుల్లో ఆ చీకట్లో సైతం తళ, తళ మెరుస్తున్న గండ్రగొడ్డళ్ళతో సముద్రంలోనుండి వచ్చిన జల భూతాల్లా వున్నారు వారు.

కాంగో అడవుల్లో మాత్రమే కనిపించే అనాగరిక ఆటవికజాతి మనుష్యులు వారు. ఇక్కడ దోనాన్ దీవుల్లో తమ కళ్ళ యెదురుగా కన్పించేసరికి మూర్ఛ వచ్చినంత పనయింది లాంబ్ కు.

వారు వికృతంగా అరచుకుంటూ ఒక్క వుదుటున ఆ ఫిషింగ్ బోట్ పైకి దూకారు. ఆ అదురుకు ఎండుటాకులా

ఊగిపోయింది ఆ చిన్నపడవ. వారిని ఎదుర్కొనడానికి కూడా ఆ మిత్రులకు అవకాశం చిక్కలేదు.

లాంబ్ నూ, గోవర్ నూ పెద్ద పెద్ద అడవితీగలతో పెడరెక్కలు విరిచికట్టి, వారిని ఈడ్చుకుంటూ వొడ్డుకు ఈదుకుంటూ పోయారు వారు.

ఈ ఆటవికులు ఎవరో, ఎందుకు తమను బంధించారో అర్థంగాక సతమతమైపోయారు ఆ యువకులు.

ఒడ్డుకు చేరగానే వారి కళ్ళకు నల్లని గుడ్డలను గంతలు కట్టి ఆ దీవి లోపలికి నడిపించుకుపోయారు వారు.

అలా నడుచుకుంటూ కొన్ని గంటలు ప్రయాణించారు వారు. తరువాత వెదురు బొంగులతో అల్లిన బల్లకట్టు లాంటి దానిమీదకు ఎక్కించారు.

తాము నీటిపాయలుగుండా మరో దీవికి ప్రయాణిస్తున్నామని గ్రహించారు ఆ మిత్రులు. ఎక్కడికో చూడటానికి వారి కళ్ళకు గంతలు కట్టి వున్నాయి. గంతలు లేకున్నా పద్మవ్యూహం లాంటి ఆ దీవులలో ఎన్ని మలుపులని గుర్తు పెట్టుకోగలరు వారు?

అలా మరికొన్ని గంటల ప్రయాణం తరువాత వారు బల్లకట్టును దిగి మరలా నడకను ప్రారంభించారు. సుమారు అరగంట గడిచాక వారి కళ్ళకున్న గంతలను విప్పదీసారు ఆ ఆటవికులు.

కొన్ని గంటలసేపు కళ్ళకు గంతలు కట్టబడివుండటం చేత, కొన్ని క్షణాలవరకూ వారికి యేమీ కనిపించలేదు. మెల్లగా కళ్ళను నులుముకొని చుట్టూ పరీక్షగా చూశారు వారు.

అప్పుడు కనిపించిన దృశ్యం వారిని ఆశ్చర్యచకితులను

చేసింది. తాము ఒక్కసారిగా యే పదిహేనవ శతాబ్ది లోనికో వెళ్ళిపోయామా అనిపించింది వారికి ఆ క్షణాన.

వారికి ఎదురుగా పెద్ద చలిమంట వేసివుంది. ఆ సెగడు చుట్టూ చేరి ఉత్సాహంగా నృత్యం చేస్తున్నారు కొన్ని వందలమంది స్త్రీ, పురుషులు. వారంతా పూర్తిగా నగ్నంగా వున్నారు. ఒక్క మొలలకు మాత్రం ఆచ్ఛాదనగా చిన్న తోలు పటకాలాంటిది ధరించారు. మెడలో విచిత్రమైన పూసలతో చేసిన హారాలు ధరించారు.

వారి మధ్య ఒక అందమైన యువతి వుంది. ఆమె కూడా పూర్తిగా నగ్నంగానే వుంది. అయితే ఆమె ఆటవిక స్త్రీ కాదు. పొట్టిగా, దృఢంగా, పచ్చని బంగారు ఛాయతో మెరుస్తూంది ఆమె శరీరం.

ఆ యువతి శరీరంనిండా సన్నని ఇనుపచువ్వలు గ్రుచ్చి వున్నాయి. ఆ ఇనుపచువ్వల చివర గుడ్డలను వత్తులుగా చుట్టి ముట్టించారు. వంటినిండా మంటలతో ఆమె జ్వాలా సుందరిలా వుంది.

మామూలు మనుష్యులైతే ఆ ఇనుపచువ్వలు కల్గిస్తున్న బాధకు, ఆ మంటల వేడికి తాళలేక మూర్ఛపోయి వుండేవారు. కాని ఆమె ఏదో మత్తులో ఉన్నట్లు ఊగుతుంది. ఆమె కళ్ళు మత్తుగా, ఎర్రగా కలువ పూవుల్లా వున్నాయి.

ఆ దృశ్యాన్ని చూస్తూనే భయంతో కంపించిపోయారు వారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఓషనాలజీని మెయిన్‌గా తీసుకున్నా, లాంబ్ మొదట హిస్టరీలో గ్రాడ్యుయేషన్ చేశాడు. అంత బీభత్సకరమైన జ్వాలా నృత్యం యెవరు చేస్తారో అతడికి బాగా తెలుసు.

ఎప్పుడో పదిహేను, పదహారవ శతాబ్దులలో మంగోలుల రాజ్యంలో మంత్రాధికారులు వుండేవారు. వారిని షామాన్‌లని పిలిచేవారు. మంగోలుల దైవమైన గోబీ ఎడారి దేవతను ఆవహింపచేయడానికి తమ శిష్యురాండ్ర చేత ఆ జ్వాలా నృత్యం చేయించేవారు ఆ షామాన్‌లు.

ఒక్కొక్క సంఘటన గుర్తుకు వస్తుంటే లాంబ్ తల గిర్రున తిరగసాగింది. ఎక్కడి కాంగో అడవులలోని ఆటవికులు, ఎక్కడి ఈజిప్టులోని స్త్రీ గొరిల్లాలు, ఎక్కడి మధ్య ఆసియాలోని మంగోలుల జ్వాలానృత్యం అన్నీ నాగరిక ప్రపంచం మరచిపోయిన సనాతన, అతి ప్రాచీన నాగరికతా జాతులే.

వీళ్ళంతా కట్టకట్టుకొని ఒక్కసారిగా దోనాన్ దీవుల్లో యెలా ప్రత్యక్షమయ్యారు.

లాంబ్ ఇలా ఆలోచనలలో మునిగి, తేలుతూ వుండగానే వారి కంటిమీద ముసుగులు ఊడదీయబడ్డాయి. వారికికూడా మొలలకు చిన్న తోలు పటకాలను ఆచ్ఛాదనగా ధరింపచేశారు.

నృత్యం పరాకాష్టతకు చేరుకున్నదనడానికి సూచనగా డ్రమ్స్ వేగంగా మ్రోగసాగాయి. గుండెలు జలదరించేలా ఒక్కసారిగా కొమ్ము బూరలు మ్రోగాయి.

ఆటవికులంతా నృత్యం చేయటం ఆపి, ఆ జ్వాలా సుందరికి సాష్టాంగపడి నమస్కరించారు. వెనుకనుండి యెవరో విసురుగా ముందుకు త్రోయడంతో లాంబ్, గోవర్‌లు కూడా ముందుకు బోర్లాపడ్డారు.

ఆ తరువాత వారిని తీసుకొని ఒక పెద్ద గోతిలో దించారు. పది అడుగుల లోతు, పన్నెండడుగుల వెడల్పు, ఆరడుగుల పొడవు వుంటుంది ఆ గోయి. ఏనుగులను

వేటాడడానికి ఆటవికులు ఉపయోగించే హంటింగ్ పిట్ అది.

ఆలివ్ ఆకులతో అల్లిన చిన్న బుట్టలో యేవో పళ్ళను యిచ్చారు వారికి. ఆ రాత్రి ఆ పళ్ళను తింటూ అలా ఆ గోతిలోనే చేరబడ్డారు ఆ మిత్రులు. శారీరకంగా, మానసికంగా పూర్తిగా అలసిపోయిన వారిని నిద్రాదేవత తొందరగానే కరుణించింది.

5

మరునాడు ఉదయం హాడ్డరినీ మరో చిన్న దీవికి తీసుకొని వెళ్ళారా ఆటవికులు. చుట్టూ పెట్టని గోడల్లా వ్యాపించిన యెత్తయిన కొండలు. వాటి మధ్య విశాలమైన మైదానం. అందులో మోకాటి ఎత్తువరకు ఎదిగిన పచ్చని పైరు.

విరిసిన తెల్లని పూలతో పచ్చగా కళకళలాడుతున్న ఆ పైరు యేమిటో కొన్ని క్షణాలవరకూ వారికి అర్థం కాలేదు. అర్థం అయిన మరుక్షణం యెవరో ఛెళ్ళన కొరడాతో వెన్నుమీద చరిచినట్లయింది వారికి.

అవి మామూలు పంట పొలాలు కావు గంజాయి మొక్కలు. ఆ పంట విలువ కొన్ని కోట్ల డాలర్లు వుంటుందేమో!

తమని తీసుకు వచ్చింది ఆ పొలాలలో పనిచేయించడానికేనని గ్రహించారు వారు. విశాలమైన ఆ పొలంలో అక్కడక్కడ వంగి పనిచేస్తున్న ముప్పయి, నలభై మంది అమెరికన్ యువకులు కన్పించారు వారికి.

అందులో పనిచేస్తున్న యెవరికీ మొలచుట్టబడ్డ తోలుపటకా తప్ప వంటిమీద మరో ఆచ్ఛాదన లేదు.

సూర్యుని లేత ఎండలో వారి శరీరాలు ఎర్రగా మెరుస్తున్నాయి.

పదిమంది ఆటవికులు గుర్రాలపై స్వారీ చేస్తూ వారిపై అజమాయిషీ చేస్తున్నారు. వారి చేతులలో పొడవాటి చర్మపు కొరడాలు ఉన్నాయి.

అక్కడ, ఆ అజ్ఞాత ప్రదేశంలో తోటి అమెరికన్ యువకులను చూడగానే గోవర్ కు ప్రాణం లేచివచ్చినట్లయింది. వారి వంక చేయి ఊపుతూ 'హేయ్' అంటూ ఉత్సాహంగా అరిచాడు.

అంతే! గుర్రం పైనున్న ఆటవికుడు ఒక్క గెంతులో గుర్రాన్ని వారి దగ్గరకు దూకించాడు. అతడి చేతిలోని చర్మపు కొరడా బలంగా గోవర్ వీపును తాకింది. కొరడా చర్మాన్ని తాకినంత మేరా చర్మం చీరుకుపోయి ఎర్రని రక్తపు చారిక యేర్పడింది. బాధతో అరచిన గోవర్ గొంతు ఆ కొండలలో ప్రతిధ్వనించింది.

చేస్తున్న పనిని ఒక్కక్షణం ఆపి, గోవర్ వంక జాలిగా చూశారు ఆ అమెరికన్ యువకులు. కట్టలు తెగి వస్తున్న కోపాన్ని అపుకోవడానికి విఫలయత్నం చేశాడు లాంబ్. ఉద్రేకంతో బిగుసుకుంది అతడి కుడిచేతి పిడికిలి. అప్రయత్నంగానే అతడు అడుగు ముందుకు వేశాడు.

అంతే! ఆ ఆటవికుని కొడికాలు బలంగా అతడి గుండెలను తాకింది. బాధగా అరుస్తూ వెనక్కు తూళ్ళి పడ్డాడతడు.

వికటంగా నవ్వుకుంటూ, విలాసంగా గుర్రాన్ని అదలిస్తూ వెళ్ళిపోయాడు ఆ ఆటవికుడు.

అక్కడ పనిచేస్తున్నంత సేపూ ఒకరితో, ఒకరు మాట్లాడుకోకూడదని.... మళ్ళీ మాటలతో వారికి చెప్ప

నవసరం లేకపోయింది.

గుండెలోని కోపాన్నీ, గొంతులోని దుఃఖాన్నీ, పళ్ళ బిగువున అణచుకొని, మెల్లగా పనికి ఉపక్రమించారు వారు.

సరిగ్గా సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చినంతవరకూ ఆగకుండా పనిచేశారు వారు. చెమటతో వారి శరీరాలు తడిసి ముద్దలయిపోయాయి.

ఒక ఆటవికుడు కొమ్ముబూరా ఊదగానే అందరూ పనిని ఆపి గట్టున ఉన్న చెట్ల నీడను చేరారు. పెద్ద, పెద్ద రాతి బానలలో వున్న మంచినీళ్ళతో ముఖమూ, చేతులూ కడుక్కున్నారు. మండుతున్న ఎండలో మాడి పోయిన వారి దేహాలకు చన్నీళ్ళు తగలగానే ప్రాణం లేచివచ్చినట్టయింది.

చిన్న, చిన్న మట్టిపాత్రాలలో రెండేసి నిండిన జొన్నరొట్టెలూ, ఇంత బార్లీ జావ, ఇన్ని ఉడకబెట్టిన యేవో అడవిదుంపలూ వేసి ఆ అమెరికన్ యువకులకు అందించారు ఆ ఆటవికులు.

ఆకలి రుచి ఎరుగదంటారు. ఆ నికృష్ట ఆహారాన్నే ఆత్రంగా, ఆబగా తినసాగారు ఆ అమెరికన్ యువకులు.

వారి ఎదురుగానే కూర్చుని బాగా వ్రేల్చిన అడవి కోడిమాంసాన్నీ, తేనెలో ముంచిన బెర్రీపండ్లను లొట్టలు వేసుకుంటూ తినసాగారు ఆ ఆటవికులు.

భోజనం పూర్తి అయినాక, కేవలం ఒక్క అరగంట మాత్రం విశ్రాంతి యివ్వబడింది వారికి. ఆ తరువాత మళ్ళీ సూర్యాస్తమయం వరకూ వంచిన నడుం యెత్తకుండా పొలంలోపడి పనిచేయడమే.

సాయంత్రం మళ్ళీ మామూలుగా వారిని ముందు

రోజా బంధించిన గోతిలోకి చేర్చారు.

అలా రెండు రోజులు గడిచేసరికి వారికి పిచ్చెక్కినట్లయింది. బానిసలలా ఇలాంటి నికృష్టపు బ్రతుకు గడిపే కన్నా ఒక్కసారి చావడం మేలనిపించింది గోవర్ధన్. అన్నింటినీ మించి తమ ఈ దుస్థితికి కారణం తన ఆవేశమే అన్న ఆలోచన అతడిని మరింత కృంగదీయసాగింది.

వాళ్ళిద్దరిలో లాంబ్ కాస్త ఆలోచనాపరుడు. అతడు సమయం కోసం ఎదురుచూస్తున్నాడు.

6

మూడవనాటి అర్ధరాత్రి....

అంతవరకూ పడుకున్నట్లు నిద్రనటిస్తున్న లాంబ్ మెల్లగా కళ్ళు తెరిచాడు. చుట్టూ పరకాయించి చూశాడు. అంతా నిశ్శబ్దంగా వుంది.

పది అడుగుల లోతున్న ఆ గోతిలో ఉంచబడ్డ ఆ ఖైదీలు ఎక్కడికి తప్పించుకుపోతారులే అన్న నిర్లక్ష్యంతో కాపలాకు నియమింపబడ్డ ఆటవికులు ఆదమరచి నిద్రపోయారు.

లాంబ్ నెమ్మదిగా గోవర్ధన్ను తట్టిలేపాడు. ఆశ్చర్యంతో తనవంక చూస్తున్న గోవర్ధన్ను మాట్లాడవద్దని సైగచేశాడు. తన మెడలోని అడవి తీగెల హారాన్ని పైకితీశాడు. అరంగుళాల పొడవున్న దృఢమైన కర్ర ముక్కలు బలమైన ఆ అడవితీగలో అక్కడక్కడా జొనిపి వున్నాయి. ఆ కర్రముక్కలు ఒక కొన సూదిగా చెక్కబడ్డాయి.

బుల్లెట్స్‌తో కూడిన చైన్‌లా వుంది ఆ హారం. ఆ రోజు మధ్యాహ్నం ఆ హారాన్ని వేసుకున్న లాంబ్‌ను

చూసి, పిచ్చివాణ్ని చూసినట్లు హేళనగా నవ్వారు ఆ ఆటవికులు.

కాని, గత రెండు రోజులుగా లాంబ్ ఆ కర్ర ముక్కలను సేకరించి ఆ దృఢమైన హారాన్ని తయారు చేసే ప్రయత్నంలో వున్నాడనీ, ఆ హారంసాయంతోనే ఆ రాత్రి ఆ గోతిలోనుండి తప్పించుకొనే ప్రయత్నం చేస్తాడనీ యేమాత్రం ఊహించినా ఆ ఆటవికులు లాంబ్‌ను అక్కడికక్కడే పోగులు పెట్టేవారు.

లాంబ్ ఆ కర్రముక్కలను హారంనుండి పైకితీశాడు. గోతియొక్క గోడకు చేసిన రంధ్రాలలో ఆ ముక్కలను బలంగా జొనిపాడు.

గత రెండు రోజులుగా రాత్రులందు.... ఆ గోతిలోని గోడకు లాంబ్ సన్నగా ఉలిలా వున్న రాతిముక్కతో రంధ్రాలు చేస్తుంటే యెందుకో అనుకున్నాడు గోవర్.

గోతిలో నిలువుగా రెండు వరుసలలో కర్రలను ఫిక్స్ చేసేసరికి లాంబ్ చెమటతో పూర్తిగా తడిసిపోయాడు. తరువాత అడవితీగను ఒక కర్రముక్క కొసకు ముడివేసి, రెండు కర్రముక్కల వరుసలనూ కలుపుకుంటూ చుట్టుకుంటూ పోయాడు.

నేలనుండి ఆరడుగుల వరకూ గోతిలో గోడకు ... నిచ్చెన వేసినట్లు అమరింది ఆ త్రాటి అల్లిక. అంతవరకూ ముందు పైకి ఎగ్రాకగల్గితే, మిగిలిన నాలుగు అడుగుల గోతి అంచునూ చేతికి పట్టుచిక్కించుకుని, పుల్ అప్స్ తీసినట్లు శరీరాన్ని గోతి బయటకు చేరవేయవచ్చు. అదీ లాంబ్ ఆలోచన.

లాంబ్ వంక ప్రశంసాపూర్వకంగా చూశాడు గోవర్. ముందుగా లాంబ్ నెమ్మదిగా ప్రాకుకుంటూ పైకి

యెక్కాడు. గోతిలోనుండి బయటపడ్డాక, చుట్టూ చూసి, కాపలా మనుషులు యింకా నిద్రపోతున్నారని ధృవపరచుకున్నాక గోవర్ ను పైకిరమ్మని సైగ చేశాడు.

ఒకవేళ కాపలా కాస్తున్న ఆటవికులలో ఎవరైనా తెలివిమీద వుంటే.... గోతిలోనుండి బయటకు రావడానికి ప్రయత్నిస్తున్న మొదటి వ్యక్తిమీదే ఎటాక్ చేస్తారు. అందుకనే ఆ రిస్క్ యేదో తనే తీసుకొందామని.... గోతిలోనుండి మొదట తనే వచ్చాడు లాంబ్.

అయితే, ప్రమాదం అతడూహించినట్లుగాకాక మరో వైపునుండి ఎదురయింది వారికి.

మొదట లాంబ్ ఎక్కుతున్నప్పుడే, అతడి బరువుకు కాస్త చితికివున్న అడవితీగ, గోవర్ మూడు అడుగులు పైకి యెక్కేసరికి తెగి ముక్కలయిపోయింది. నిస్సహాయంగా క్రిందకు జారిపోయాడతడు.

గోతిలో వుండిపోయిన మిత్రుని వంక ఆందోళనగా చూశాడు లాంబ్. వారికి ఏం చేయాలో తోచడంలేదు. బోనులో చిక్కిన పెద్దపులిలా గోతిలో తిరుగుతున్నాడు గోవర్.

ఒక్కొక్క క్షణం గడుస్తున్నకొద్దీ వారిలో టెన్షన్ పెరిగిపోసాగింది.

ఏదో ఒకటి చేయాలి. కాపలా వ్యక్తులకు తెలివి రాకముందే యేదో ఒకటిచేసి గోవర్ ను తప్పించాలి.

లాంబ్ మస్తిష్కం చురుగ్గా పనిచేయ సాగింది. నిద్రపోతున్న ఒక ఆటవికుని ప్రక్కన పడివున్న పొడవైన ఈటెను చూడగానే అతడి మెదడులో యేదో మెరుపు మెరిసినట్లయింది.

సుమారు తొమ్మిది అడుగుల పొడవుంది ఆ ఈటె.

నెమ్మదిగా ప్రాకుతుంటూ వెళ్ళి చప్పుడు చేయకుండా ఆ ఈటెను పట్టుకువచ్చాడు లాంబ్.

గోతిలో ఆత్రంగా యెదురుచూస్తున్న గోవర్‌కు ఆ ఈటెను అందించి, ఆ తరువాత ఏం చేయాలో సైగలతో చెప్పాడు. అతడు చెప్పినది అర్థమయ్యేసరికి ఆశ్చర్యంతో గోవర్ కళ్ళు పెద్దవయ్యాయి.

లాంబ్ చెప్పినది చాలా రిస్కుతో కూడిన ఫీట్. కాని ఆ గోతిలోనుండి బయటపడటానికి వారికి మరో మార్గం కనిపించలేదు. ఈటెను చేతిలోనికి తీసుకొని గోతియొక్క చివరకు నడిచాడు గోవర్.

అతడు కాలేజ్ డేస్‌లో పోల్ వాల్టు జంప్‌లో ఫస్టు. తొమ్మిది అడుగుల కర్ర సాయంతో పన్నెండడుగుల గోడను దూకడం అతడికి కష్టమైన పనేమీ కాదు. అదీ గాక ఆ గోతి ఎత్తు కేవలం పది అడుగులే.

అయితే యిక్కడ రెండు సమస్యలు వున్నాయి.

మొదటిది పోల్ వాల్టు జంప్‌కు ముందుగా పరుగెత్తడానికి స్థలం వుండాలి. యిక్కడ గోతి పొడవు కేవలం పన్నెండు అడుగులే వుంది. ఆ పన్నెండు అడుగుల స్థలంలోనే పరుగెత్తడం, ఈటెను ఏటవాలుగా భూమిలోనికి జొనపడం, ఆ ఆధారంతో గాలిలోకి లేచి సరిగ్గా గట్టు మీదకు దూకడం, ఇవన్నీ మాటలతో చెప్పినంత సులభం కాదు, చేసి చూపించడం.

యిక రెండవది: గట్టుమీద దూకేటప్పుడు ఏమాత్రం చప్పుడయినా కాపలా మనుషులు లేస్తారు. దానితో ఇంత శ్రమా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది.

అలా చప్పుడు కాకుండా వుండాలంటే గోవర్ గట్టు మీదకు దూకకముందే గాలిలోనే లాంబ్ అతడిని పట్టు

కోవాలి. అదే సమయంలో క్రిందపడి శబ్దం చేయకుండా ఈ పెన్ను కూడా పట్టుకోవాలి.

సర్కస్ ఫీట్స్ కంటె కూడా కష్టతరమైన ఈ ప్రయత్నం వారిద్దరికి కూడా అగ్నిపరీక్ష వంటిదే. వారిద్దరూ ఒకరినొకరు ఒక్క క్షణంపాటు చూసుకున్నారు. ఆత్మవిశ్వాసాన్నంతా కూడదీసుకొని తమ, తమ స్థానాల్లో నిలుచున్నారు.

లాంబ్ నిలుచున్న స్థలాన్ని, తన పొజిషన్ని తమ మధ్య దూరాన్ని, మనసులోనే అంచనా వేసుకున్నాడు గోవర్. రెండు చేతులనూ ముందుకుచాచి సిద్ధంగా నిలబడ్డాడు లాంబ్.

దేగలా గోవర్ ముందుకు కదలి, గాలిలోనికి లేవడం అతడిని లాంబ్ ఒడిసి పట్టుకోవడం.... అంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది. గుండెలమీదనుండి కొండంత బరువు క్రిందకు దిగినట్లు ఫీలయ్యారు వారు.

నెమ్మదిగా చీకటిలో అడుగులు వేస్తూ చెట్లచాటుకు జారిపోయారు వారు. తమ అడుగుల చప్పుడు కాపలా వ్యక్తులకు వినిపించనంత దూరం వచ్చేశామని నిర్ధారణ చేసుకున్నాక వారు పరుగెత్తడం ప్రారంభించారు

ముళ్ళకంపలు గీసుకుంటూ చర్మాన్ని చీలుస్తున్నా, రాళ్ళు తగిలి, కాలి వ్రేళ్ళు చితికి రక్తాలు కారుతున్నా, ఆయాసంతో గుండెలు ఎగిసి, ఎగిసి పడుతున్నా, వారు పరుగెత్తడం మానలేదు.

పరుగు ఆపడమంటే ప్రాణాలమీదకు కొని తెచ్చుకోవడమేనని తెలియని పిచ్చివాళ్ళుకారు వారు.

సూర్యోదయం అవుతూండగానే వారు తప్పించుకున్నారన్న వార్త ఆటవిక గూడెంలో దావానలంలా

వ్యాపించింది. వెంటనే పదిమంది ఆటవికులు రెండు జట్లుగా విడిపోయి వారికోసం అన్వేషణ ప్రారంభించారు.

7

సూర్యోదయమయ్యే సమయానికి ఆ దీవి ఒడ్డుకు చేరుకున్నారు వారు. కేవలం పది, పదిహేను అడుగుల దూరంలో వారికి నల్లని సముద్రపు పాయ కన్పిస్తూంది. ఒక ముళ్ళపొద చాటున కూర్చుని 'ఏం చేయాలా' అని ఆలోచిస్తున్నారు వారు.

"ఏం చేద్దాం లాంబ్? ఇక్కడ మనం ఆలోచిస్తూ కూర్చుంటే.... ఆ ఆటవికులు వచ్చేస్తారు."

"అదే ఆలోచిస్తున్నా గోవర్, ఈసరికి మనం తప్పించుకున్నామన్న వార్త వారికి తెలిసిపోయే వుంటుంది. అంటే మనకోసం వెదకటం ప్రారంభమయ్యే వుంటుంది."

"అయితే ఏం చేద్దామంటావు?"

"చేయడానికైనా, మానడానికైనా మనకు ఒకటే మార్గం వుంది గోవర్."

గోవర్ అర్థంకానట్లు లాంబ్ వైపు చూశాడు. చిన్నగా నవ్వుతూ గోవర్ చేయిపట్టుకొని పైకిలేచాడు లాంబ్.

"ఈ కాలువగుండా గ్రుడ్డిగా ఈదుకుంటూ పోవడమే. మన అదృష్టం బాగుంటే ఈ దీవుల చక్రబంధంనుండి బయటపడవచ్చు కమాన్ ఫ్రెండ్."

వారు రెండు అడుగులు ముందుకు వేశారో లేదో 'టు....ర్....ర్....' మంటూ వినవచ్చింది ఒక వికృత ధ్వని.

అంతే ...ఒకదాని తరువాత ఒకటిగా కొన్ని వందల పక్షులు అరచినట్లు ఆ వికృత ధ్వనులతో ఆ దీవి

మాలోన్మగిపోయింది.

అడుగు ముందుకు పడక శిలావిగ్రహాల్లా వుండిపోయారు వారు. తల పైకెత్తి ఆ ధ్వనులు వచ్చిన దిక్కుగా నిశితంగా చూశాడు లాంబ్.

ఏపుగా పెరిగిన చెట్లకొమ్మలమీద యేర్పరచబడ్డ మంచెలమీద నిలబడి వున్నారు కొందరు యువతులు. పెదవులమధ్య రెండు వేళ్ళను పెట్టి ఆ విచిత్ర శబ్దాలను చేస్తున్న వారిని చూసేసరికి వారు ఈజిప్టు దేశానికి చెందిన ఆటవిక యువతులని అర్థమైపోయింది అతడికి.

"అంటే తన అంచనా తప్పుకాదన్నమాట" అనుకున్నాడతడు. అయితే అతడికి అర్థంకానిది ఒక్కటే.

'ఇన్ని విభిన్న దేశాలకు చెందిన ఆటవిక జాతులను ఒక్కటిగా కలిపింది ఎవరు? అసలు వారిని ఏ లక్ష్యంతో కలిపాడు!'

అతడి మనసు ఆలోచిస్తున్నా .... అతని కాళ్ళు మాత్రం చురుగ్గా సముద్రంవైపు పరుగెత్తాయి.

తమది విఫల యత్నమనీ, వారి కళ్ళబడ్డాక, యిక తాము దొరికిపోవడం తథ్యమనీ వారికి తెలుసు. కాని యింకా యేదో చిన్న ఆశతో వారు తమ ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నారు.

వారు నీటిలో దుమికి పెద్ద, పెద్ద బారలువేస్తూ ఈదసాగారు. కేవలం ఒక్క ఫర్లాంగు దూరం ఈదుకుంటూ పోయివుంటారు వారు. అంతే!

ఒక్కసారి చుట్టూ చూసిన వారిలో చెప్పలేని నిస్సత్తువ చోటుచేసుకుంది.

"వుయ్ ఆర్ ఫినిష్డ్ ఫ్రెండ్స్" అన్నాడు లాంబ్ గోవర్ధన్ వంక బాధగా చూస్తూ.

నాలుగు ప్రక్కలనుండి ఒక్కసారి పదిమంది ఆటవికులు సముద్రంలోనుండి తేలివచ్చారు. కొన్ని క్షణాలలో వారిని చుట్టుముట్టారు.

వారిని బందీలనుచేసి వెనక్కు తీసుకొనిపోయారు. అయితే ఈసారి మొదటి ఆటవిక గూడేనికిగాక వేరే ప్రదేశానికి తీసుకొనిపోయారు.

8

అది.... ఆటవిక రాజదర్బారు.

రాతి పలకలను పేర్చి చేయబడ్డ ఎత్తయిన వేదిక. దానిమీద రాతితో నే చేయబడ్డ ఎత్తయిన పీఠం. ఆ పీఠంపైన అరవై యేళ్ళ వృద్ధుడు కూర్చుని వున్నాడు. నడుముకు లేడి చర్మంతో చేసిన గోనులాంటిది ధరించాడు. పూసల పేర్లు, ముఖాన బొట్లూ అన్నీ మిగిలిన ఆటవికుల లాగానే వున్నాయి. తలపై మాత్రం పక్షి ఈకలతో చేసిన కిరీటంలాంటిది ధరించాడు.

"బహుశా.... అతడు ఆటవికుల నాయకుడు అయి వుంటాడు" అనుకున్నారు వారు.

అతడు చేయి సైగ చేయగానే, గోవర్, లాంబ్ అను ఆ సభలో ప్రవేశ పెట్టిన ఆటవికుడు.... వారి భాషలో యేదో చెప్పాడు.

చుట్టూ పేర్చబడ్డ రాతిపలకలమీద కూర్చున్న ఆటవికులు కళ్ళు విప్పార్చుకుని వినసాగారు.

"తాము తప్పించుకున్న విధానం నాయకుడికి చెబుతున్నాడని" ఊహించారు వారు.

కోటిలో తల పెట్టాక రోకటిపోటుకు భయపడటం యెందుకన్నట్లు నిర్భయంగా నిలబడ్డారు వారు.

నాయకుడు వారి వంక చూస్తూ చిన్నగా తల పంకిం

చాడు. అతడు చేసైగ చేయగానే పదిమంది యువతులు ముందుకు వచ్చారు. వివిధ దేశాలకు చెందిన వారు.

వారు ఒక్కొక్కరు తమ మెడలోని పూసల దండను తీసి ఒక రాతి ఫలకంమీద వుంచారు. ఒక ఈజిప్టు యువతి తన మెడలోని పూసలదండను రాతిఫలకంమీద వుంచుతూ లాంబ్ వైపు చూసి కన్నులను అరమోడ్చింది.

ఆమె యెందుకు సైగ చేసిందో అర్థంకాలేదు అతడికి. కాని అప్రయత్నంగానే ఆ పూసల దండను మాత్రం గుర్తుపెట్టుకున్నాడతడు. అది తెల్లని పూసలతో చేసిన దండ.

ఆ యువతులందరూ తమ దండలను అక్కడ వుంచాక, ఒక ఆటవికుడు వచ్చి గోవర్ నూ, లాంబ్ నూ వాటిలో చెరి ఒక దండ తీసుకొమ్మని సైగ చేసి చెప్పాడు.

తమకు యేదో కఠిన శిక్షపడుతుందని భావించారు వారు. కాని ఈ పూసల దండల భాగోతం యేమిటో వారికి అర్థం కాలేదు.

అయినా వారు చెప్పాక తప్పదు కాబట్టి చెరి ఒక దండనూ తీసి పట్టుకున్నారు. లాంబ్ చేతిలోని తెల్ల పూసల దండనుచూసి ఆ ఈజిప్టు యువతి కళ్ళు విచిత్రంగా మెరిశాయి.

వారిద్దరినీ చెరి ఒక గుడిసెలోనికి చేర్చి తలుపులు మూశారు ఆ ఆటవికులు.

చీకటి పడ్డదాకా వారి గురించి పట్టించుకున్నవారే లేకపోయారు. మధ్యాహ్నం మాత్రం యేదో యింత ఆహారం వారికి అందించబడింది.

ఆ గుడిసెలలో ప్రవేశించినప్పుడే వారు వాటికి యేర్పాటు చేయబడ్డ కట్టుదిట్టమైన కాపలాను గమనిం

చారు. ఇక తప్పించుకోవడం అసాధ్యమని తెలుసు వారికి.

అందులో ఇప్పుడు ఇద్దరూ ఒక్కచోట లేరు కూడానూ. అందుకే దేవునిమీద భారం వేసి, క్షణాలు లెక్క పెడుతూ కూర్చున్నారు వారు.

సరిగ్గా చంద్రోదయమయ్యే సమయానికి తలుపు తోసుకుంటూ లోపలకు ప్రవేశించింది ఆ ఈజిప్టు యువతి. ఆమెను చూడగానే ఉత్సాహంగా లేచాడు లాంబ్.

ఏదో అడగబోతున్న అతడిని మాట్లాడవద్దని కళ్ళతోనే వారించింది ఆమె. చేతిలోని బుట్టలోని పళ్ళను చూపిస్తూ తినమన్నట్లు సైగ చేసింది. ఆ బుట్టలోనే చిన్న రాతిగిన్నెలో ఉన్న పాలను త్రాగబోయాడు లాంబ్. వద్దన్నట్లు సైగ చేసిందామె.

ఆమె సంజ్ఞను అర్థంచేసుకొని, వాటిని త్రాగినట్లు నటించాడు అతడు. లాంబ్‌ను చేయిపట్టుకొని ఆ గుడిసెలో ఒక మూలనున్న మంచంవైపు తీసుకువెళ్ళిందామె. తనను కౌగలించుకొమ్మన్నట్లు సైగ చేసింది.

ఎందుకో ఆ యువతి ముఖం చూస్తుంటే తనకు మేలే చేస్తుంది అనిపించింది అతనికి. అందుకే మారు మాట్లాడకుండా ఆమె చెప్పినట్లు చేయసాగాడు.

కొన్ని క్షణాలలో వారిద్దరూ నగ్నంగా తయారయ్యారు. ఒకరినొకరు పాముల్లా అల్లుకుపోయారు. ముందుగా నటన అని ప్రారంభించినా, నిండుగా, బలంగా తన శరీరానికి తాకుతున్న ఆమె అవయవాల స్పర్శకు అతడిలో కోరిక సన్నగా రేగసాగింది.

పట్టలేని తమకంతో ఆమె ఎర్రని పెదవులను గాఢంగా ముద్దు పెట్టుకున్నాడతడు. కోరికతో కన్నులు అర మోడ్పు

లవుతుంటే అతలా అతడిని అల్లుకుపోయిందామె.

ఎన్ని క్షణాలు అలా తీయగా దొర్లిపోయాయో! ఏయే మధుర లోకాల్లో వారు విహరించివచ్చారో.

రసకేళిలో అలసిన అతడు ఆమె నిండయిన గుండెల మధ్య తల వాల్చి సేద తీర్చుకోసాగాడు. చెదిరిన అతడి ముంగురులను సవరిస్తూ అతడి తలను ప్రేమగా తన గుండెలకు హత్తుకుంది ఆమె.

అదే సమయంలో ఒక శ్రావ్యమైన నాదం విన వచ్చింది వారికి. ఎవరో ఒక సన్నని తీగెను కొన గోటితో మీటుతున్న ధ్వని 'ట్రింగ్ .... ట్రింగ్ ....' మంటూ ఒకే రిథమ్‌లో వినబడసాగింది.

లాంబ్ మెదడు మెల్ల మెల్లగా ఆ ధ్వని తరంగాల వైపు ఆకర్షితమవ్వసాగింది. అదే క్షణంలో ఆ యువతి ఆటవిక భాషలో యేదో అనసాగింది.

లాంబ్ తల మొద్దుబారసాగింది. కొన్ని క్షణాల తరువాత ఆ నాదం ఆగిపోయింది. ఆ యువతి మంచం దిగి గుడిసె బయటకు వెళ్ళి, మళ్ళీ లోపలకు వచ్చింది.

9

"అమ్మయ్యా! వాళ్ళు వెళ్ళిపోయారు" అంది ఆమె తేలిగ్గా నిట్టూరుస్తూ.

ఆమె మాటలను వింటూనే ఉలిక్కిపడ్డాడు లాంబ్. అప్పుడామె మాట్లాడినది ఆటవిక భాష కాదు. కొంచెం యాసతో కూడిన ఇంగ్లీషు.

తన వంక ఆశ్చర్యంగా చూస్తున్న లాంబ్‌ను చూసి చిన్నగా నవ్విందామె.

"నాకు ఇంగ్లీషు వచ్చు."

ఇంకా ఆమె వంక నమ్మలేనట్లే చూడసాగాడతడు.

ఆమె మెల్లగా నడిచి వచ్చి లాంబ్ ప్రక్కనే మంచం మీద కూర్చుంది.

"జన్మతః ఈజిప్టు దేశీయులమైనా, నేను చిన్నతనం నుండీ పెరిగిందీ, చదువుకున్నదీ ఇంగ్లాండ్‌లోనే. మా నాన్నగారు గొప్ప పేరుమోసిన ప్రకృతి వైద్యుడు. డాక్టర్ మోజస్ పేరు చెబితే లండన్‌లో తెలియని వారు లేరు.

ఆయన యెప్పుడూ మూలికలతోనూ, ఆకు పసరుల తోనూ యేవో ప్రయోగాలు చేస్తూ ఉండేవారు.

ఒకరోజు ఉన్నట్లుండి నన్ను తీసుకొని దోనాన్ దీవులకు ప్రయాణమయ్యారు. తన పరిశోధనకు కావలసిన అద్భుతమైన కొన్ని మూలికలు దోనాన్ దీవులలో లభించే అవకాశం వుందట.

మేము మొదటగా ఫాదర్ గ్రాహాంపాల్‌ను కలుసు కున్నాం. మా నాన్నగారి కోరిక విన్నవెంటనే ఆయన యెంతో కలవరపడ్డారు.

"డాక్టర్ మోజస్! మీరు అనుకుంటున్నట్లుగా దోనాన్ దీవులు ప్రకృతి ప్రసాదించిన దివ్యౌషధాలకు నిలయాలు కావు. అవి....మనుష్యుల ప్రాణాలను పొట్టను పెట్టుకొనే రాక్షస దీవులు."

అంటూ ఆ దీవులకు వెళ్ళవద్దని మా నాన్నగారిని యెంతగానో వారించారు ఫాదర్ పాల్.

కాని, మా నాన్నగారు తన మొండి పట్టుదలను విడువలేదు. తను చేస్తున్న పరిశోధన యేమిటో చెప్పే సరికి, ఫాదర్ పాల్ మారు మాట్లాడలేకపోయారు."

"ఏమిటా పరిశోధన" ఆత్రంగా అడిగాడు లాంబ్.

"ఫాదర్ పాల్ కూడా అచ్చం నీలాగే ప్రశ్నించారు"

అంది ఆమె నవ్వుతూ. ఒక్క క్షణం ఆగి మళ్ళీ చెప్పడం ప్రారంభించింది ఆమె.

"అది వశీకరణ విద్య. మన ఆధునికులం ఈ రోజు బ్రెయిన్ వాష్ అంటున్నాం. ప్రాచీన ఈజిప్టు గ్రంథాలలో యెక్కడో ఈ వశీకరణ శక్తిని ప్రసాదించే రససిద్ధి గురించి చదివారట మా నాన్నగారు. అప్పటినుండి ఆ రససిద్ధి కోసం అహోరాత్రాలూ శ్రమించసాగారు ఆయన.

తానొకటి తలిస్తే, దైవమొకటి తలుస్తాడంటారు. దోనాన్ దీవులలోనికి మూలికల సేకరణకోసం వెళ్ళిన మేము సముద్రపు దొంగలయిన ఈ ఆటవికుల చేతికి చిక్కాం."

"సముద్రపు దొంగలా!" ఆశ్చర్యంగా అడిగాడతను.

'ఈ మాత్రం ఊహించలేదా!' అన్నట్లు లాంబ్ వంక విచిత్రంగా చూసిందామె.

"మరి! దోనాన్ దీవుల సమీపంలోనికి వచ్చిన ఓడలలోని సరకులనూ, మనుష్యులనూ మాయం చేస్తున్నది ఎవరనుకున్నావు?" అంది ఆమె లాంబ్ వంక సూటిగా చూస్తూ.

"సరకులను దొంగిలించారంటే అర్థముంది. మరి మనుష్యులను ఎందుకు కిడ్నాప్ చేస్తున్నట్లు....?"

ఓహో! హెరాయిన్ పండించడానికి, వారికి బానిసలలా పనిచేసే కూలీలు కావాలి కదూ!

ఒక్కొక్క సందేహం మంచు తెరలా విడిపోతున్నట్లుగా అనిపించసాగింది లాంబ్ కు.

అడవిలో ఎండుటాకులమీద అడుగుల చప్పుడు వినబడకుండా, మృగాలను వేటాడగలిగే ఆటవికులకు, చడీ

చప్పుడు చేయకుండా ఓడలోని సరకులను, మనుష్యులనూ మాయం చేయటం ఒక లెక్కలోని విషయం కాదు.

కాకుంటే ముందుజాగ్రత్త కోసం షిప్‌లోని జనరేటర్‌ను ముందుగా ఆపేస్తున్నారన్నమాట. నీటిలో తేలి చీకటిలో తమ పనిని చక్కగా చక్కబెట్టుకుని తిరిగి నీటిలోకి వెళ్ళిపోతున్నారు.

అయితే.... కొండల్లో, కోనల్లో హాయిగా, స్వేచ్ఛగా బ్రతికే ఈ కొండజాతివారు, నాగరిక ప్రపంచంమీద చేస్తున్న ఈ దాడులన్నీ తమ స్వబుద్ధితోనే చేస్తున్నారంటే అది నమ్మశక్యం కాని విషయం.

వారి వెనుక, వారిని నడుపుతున్న యేదో నాగరిక హస్తం వుండితీరాలి.

'ఎవరు....? ఎవరా నాగరిక రాక్షసుడు....?'

ఉన్నట్లుండి యేదో తీవ్రాలోచనలో మునిగిపోయిన లాంబ్ భుజాలను పట్టుకొని కుదిపింది ఆమె.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"అహఁ....ఏం లేదు" అన్నాడు లాంబ్ సరిగ్గా సర్దుకుని కూర్చుంటూ.

"అన్నట్లు, ఇంతకూ మీ నాన్నగారు ఆ వశీకరణ శక్తిని సాధించారో, లేదో చెప్పనే లేదు" అన్నాడతడు ఆమె వంక సాలోచనగా చూస్తూ.

"సాధించారు కదా" అంది ఆమె చక్రాల్లాంటి కళ్ళను గుండ్రంగా త్రిప్పుతూ.

"మమ్మల్ని బంధించిన ఆ ఆటవికులు మా నాన్నగారిని ఆ వశీకరణ రసాన్ని కనిపెట్టమనీ, లేకుంటే నన్ను చంపేస్తామనీ బెదిరించారు.

నాకోసం, నా ప్రాణాలను కాపాడటంకోసం....
మా నాన్నగారు నిద్రాహారాలు మాని మరీ శ్రమించారు.
చివరకు యెలాగైతే నేం—ఆ రసనిద్ధిని సాధించారు.

"ఆ రసాన్ని నేనొకసారి చూడటానికి వీలు అవుతుందా?" అన్నాడు లాంబ్ ఆత్రంగా.

"ఎందుకు కాదు?"

"ఎప్పుడు?"

"ఎప్పుడు కావాలంటే అప్పుడు. కా వా లం టే ఇక్కడే.... ఈ క్షణమే."

లాంబ్ నమ్మలేనట్లు చూశాడు ఆమె వంక. ఆమె మెల్లగా మంచంమీదనుండి లేచింది. వడుచుకుంటూ వెళ్ళి, ఇంతకు క్రితం లాంబ్‌ను త్రాగవద్దని వారించిన రాతి చిప్పలోని పాలలాంటి ద్రవాన్ని తీసుకు వచ్చి అతడికి చూపింది.

"ఇదా!" ఆశ్చర్యంగా అన్నాడతడు.

"ఆఁ....ఇదే! ఎన్నో అద్భుతమైన మూలికల మిశ్రమం ఇది.

కాకుంటే ఈ మూలికా రసాన్ని సేవించిన కొద్ది క్షణాలలో ఆ సేవించిన మనిషిలో విపరీతమైన కామం బయులుదేరుతుంది.

వారు వెంటనే స్త్రీ సంభోగంలో పాల్గొనాలి. లేకుంటే కోరికతో పురి ఎక్కిన నరాలు మరింత ఉత్తేజితమై మెదడులోని రక్తనాళాలు చిట్లి, వారికి మరణమే సంభవిస్తుంది.

అలా ఆ స్త్రీ పురుషులు మైధున క్రీడలో మునిగి ఉన్నప్పుడు, చాటునుండి సన్నని తీగను మీటుతూ ఒక రకమైన ధ్వని ప్రకంపనాలను వారికి వినిపింపజేస్తారు.

మూలికారసం ప్రభావంచేత చైతన్యం కోల్పోయిన మెదడులోని పాత జ్ఞాపకాలన్నీ చెరిపివేయడానికి అదొక ప్రక్రియ.

అదే సమయంలో అతను సంభోగిస్తున్న స్త్రీ.... ఆటవిక భాషలో...మంద్ర స్వరంతో ఇలా చెబుతుంది.

'ఈ ప్రపంచంలో నీకు తెలిసింది నేను ఒక్కతెనే. నీవు చేసేదీ, చూసేదీ, బ్రతికేదీ.... ఈ క్షణంనుండీ అంతా నాకోసమే. నీవు నా దాసుడివి. బానిసవు. నేను ఏం చెప్పినా, మారుమాట్లాడకుండా నీవు ఆచరిస్తావు, ఆచరిస్తావు, ఆచరిస్తావు.'

ఇలా ఈ తతంగమంతా వరుసగా మూడు రాత్రులు జరుగుతుంది. నాలుగవనాటి ఉదయం నుండీ ఆ వ్యక్తి ఆమెకు పూర్తిగా బానిసైపోతాడు."

ఆమె చెప్పినదంతా వినేసరికి అంత రాత్రిలోకూడా అతడి నుదుట చెమట పట్టింది.

"అంటే....బందీలుగా తెచ్చిన నాగరికులందరినీ ఈ వశీకరణ విద్యతో బానిసలుగా మారుస్తారన్నమాట."

లాంబ్ మాటలకు....ఆమె తల అడ్డంగా ఊపింది.

"ఉహుం....కారు. అందరిమీదా ఆ విద్యను ప్రయోగించరు. ముందుగా బందీలను గంజాయి తోటల్లో పనికి నియమిస్తారు. అక్కడ జీవచ్ఛవాల్లా పడివుంటూ, సజావుగా పని చేసుకుపోయినంతవరకూ వారి జోలిపట్టరు.

కాని, మీలా ఎవరైనా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తే, వారిని ఈ వశీకరణ శక్తిద్వారా బానిసలుగా మారుస్తారు."

"అంటే....రాత్రి....ఆమె స్థానంలో మరొక స్త్రీ ఉండివుంటే ఈపాటికి తనుకూడా ఆ వశీకరణ శక్తికి

బానిసై వుండేవాడన్నమాట" అనుకున్నా డతడు.

ఆమె వంక కృతజ్ఞతగా చూశాడు లాంబ్.

"ఎందుకు నన్ను రక్షించావు?" అతడి గొంతు ఆర్ద్రంగా పలికింది.

"ఎందుకో నిన్ను చూశాక, నీవు తప్పించుకోవడానికి చేసిన ప్రయత్నం గురించి విన్నాక....నిన్ను రక్షించాలని పించింది.

బహుశా....నన్నూ, మా నాన్నగారిని ఈ రాక్షసుల బారినుండి నీవు రక్షించగలవేమోనన్న ఆశతో నేమో!"

ఆమె అరచేతిని ప్రేమగా తన చెక్కిలికి అనించుకున్నాడతడు.

ఇద్దరు యువతీ, యువకుల మధ్య, ప్రేమ ఎందుకు జనిస్తుందో. ఎక్కడ మొదలవుతుందో చెప్పలేమనడానికి వారి జంటే ఒక ప్రత్యక్ష సాక్ష్యం.

వారి మధ్య పరిచయం అయి కొన్ని గంటలుకూడా కాలేదు. అది ఆకర్షణ కాదు. పోనీ, కామం అందామంటే అది కొన్ని క్షణాల క్రితమే చాలా యాంత్రికంగా వాళ్ళ మధ్య జరిగిపోయింది.

అతడిని రక్షించడం కోసం ఆమె తన శరీరాన్ని అర్పించింది. నిజం తెలిశాక అతడు ఆమెకు తన మనసునే అర్పిస్తున్నాడు.

"నీ పేరు....?" ఆమె కళ్ళలోనికి చూస్తూ అన్నాడతడు.

"ఇప్పుడా అడగటం?" అంది ఆమె కొంటెగా నవ్వుతూ.

"నా దానవని తెలిసింది ఇప్పుడేగా" అన్నాడు లాంబ్ మరింత చిలిపిగా.

ఆమె సిగ్గుతో తల దించుకుంది.

అతడి ఎదుట అర్ధనగ్నంగా తిరుగాడినప్పుడు రాని సిగ్గు, అతనితో ఆ తీయని అనుభవాన్ని పంచుకున్నప్పుడు రాని సిగ్గు....

'నా దానివి' అన్న అతడి మాట విన్న వెంటనే సిగ్గు ఆమెను నిలువెల్లా ముంచెత్తింది.

"నీ....రా...." అంది ఆమె నెమ్మదిగా ఒక్కొక్క అక్షరాన్నీ ఒత్తి పలుకుతూ.

ఆమెను ప్రేమగా కౌగిలిలోనికి తీసుకున్నాడు. పెదవులతో సుతిమెత్తగా ఆమె చెక్కిలిపై రాస్తూ మత్తుగా యిలా అన్నాడతడు.

"నీరా....ఐ లవ్ యూ."

"ఐ....టూ....లాంబ్" అంటూ అతడిని లతలా పెనవేసుకుపోయింది ఆమె.

10

నాల్గవ రోజు ఉదయం....గోవర్, లాంబ్ నాయకుని ముందు హాజరు పర్చబడ్డారు. ఓరకంటితో గోవర్ వంక చూశాడు లాంబ్.

నిరాసక్తంగా శూన్యంలోనికి చూస్తున్నాడు గోవర్. అతడి కళ్ళు నిస్తేజంగా వున్నాయి.

"హా! గోవర్ వారి వశీకరణ శక్తికి లోబడిపోయాడన్నమాట" అనుకున్నాడు లాంబ్.

మరుక్షణం అతడుకూడా నిరాసక్తంగా శూన్యంలోనికి చూడసాగాడు. వారిద్దరినీ చూసిన నాయకుడు సంతృప్తిగా తలాడించాడు.

ఆ ఆటవిక స్త్రీలు సైగచేయగానే గోవర్, లాంబ్ ఆ నాయకుడికి సాష్టాంగపడి నమస్కరించాడు.

పట్టలేని ఆనందంతో పగలబడి నవ్వాడు ఆ నాయకుడు.

"సింహాలలాంటి యువకులు ఆ మందు దెబ్బకు చిట్టెలుకలయిపోయారు" అనుకున్నా డతడు మీసం మెలివేస్తూ.

నాయకుడు చేసైగ చేయగానే వారిద్దరినీ అక్కడి నుండి తీసుకుపోయారు. ఆ క్షణంనుండీ వారి దినచర్య పూర్తిగా మారిపోయింది.

వారిని స్వేచ్ఛగా వదిలేశారు ఆ ఆటవికులు. గత జీవితాన్ని పూర్తిగా మరచిపోయి, పసిపాపల్లా వారేం చెబితే అది చేసే స్థితిలో వుండే ఆ నాగరిక యువకులు యెక్కడికీ పోలేరని వారికి తెలుసు.

ప్రతిరోజూ వారిద్దరకూ, తమ ఆటవిక ఆయుధాలను ప్రయోగించటం, సముద్రంలో చప్పుడుకాకుండా ఈదడం, తాళ్ళసాయంతో షిప్ మాదిరిగా చేయబడ్డ ఒక పెద్ద చెక్క యింటిపై ఎగబ్రాకటం, అందులోని సామానులను, మనుష్యులను మోసుకుంటూ మళ్ళీ నీటిలోకి దిగటం....లాంటి విద్యలన్నీ నేర్పసాగారు ఆటవికులు. ఎ ట్రయినింగ్ ఫర్ పైరేట్స్.

తన అస్తిత్వాన్ని పూర్తిగా కోల్పోయిన గోవర్ వారు చెప్పినదంతా మారు మాట్లాడకుండా చేసేవాడు. కాని, అన్నీ తెలిసి, ఏమీ తెలియనట్లు నటించడం లాంబర్ట్ కే యెంతో కష్టంగా వుంది.

ముఖ్యంగా తన ప్రాణ స్నేహితుడు గోవర్ తనతో ఎవరో పరాయివాడిలా ప్రవర్తించడం....అతడికి భరించలేనంత కష్టంగా వుంచి.

కాని....కర్తవ్యం అతడిని వెన్ను తట్టేది.

'సమయం వచ్చేటంతవరకూ తను ఇలాగే నటించాలి. తప్పదు' అనుకునేవాడతడు.

కత్తిమీద సాములాంటి ఈ జీవితంలో అతనికి మనశ్శాంతి నిచ్చే ఆశాకిరణం....ఒక్క నీరాయే.

ప్రతిరోజూ రాత్రి నీరా అతని కుటీరానికి వచ్చేది. రాత్రి చాలా పొద్దుపోయేవరకూ వారు ఎన్నో విషయాలు మాట్లాడుకునేవారు. అవన్నీ ఆ రాక్షస దీవులనుండి బయటపడటం గురించే.

అయితే అది ఎంత కష్టతరమో అతడికి బాగా తెలుసు. తనూ, నీరా, ఎక్కడున్నాడో కూడా తెలియని ఆమె తండ్రిని వెతికి పట్టుకొని మతిలేని గోవర్ను తీసుకొని అంతుపట్టని ఆ దీవులనుండి బయటపడటమంటే "అది సాధ్యమయ్యే పనేనా" అనిపించేది అతడికి. కాని, ఎక్కడో ఏదో ఆశ మిణుకు, మిణుకు మనేది.

11

ఆ రోజు ఆటవికుల దేవత జాతర.

చీకటి పడేకొద్దీ ఆ ద్వీపంలో కోలాహలం రెట్టింపయింది. ఆటవికులంతా రంగు, రంగుల పూసల హారాలనూ, పక్షి ఈకలను ధరించారు.

ఎండు సొరకాయ బుర్రలలో పులియబెట్టిన ద్రాక్ష సారాయిని చిత్తుగా త్రాగారు వారంతా. మత్తులో వారి శరీరాలు జోగుతున్నాయి. వారంతా దేవతా విగ్రహం వున్నచోటుకు చేరుకున్నారు.

పదిహేను అడుగుల ఎత్తు వుంటుంది ఆ దేవతా విగ్రహం. సింహం శరీరం, మనిషి తల. పక్షి రెక్కలతో చూడటానికి ఎంతో విచిత్రంగా వుంది ఆ విగ్రహం.

దానిముందు పెద్ద సెగడు వుంది. అందులోనుండి ఎర్రని మంటలు విరజిమ్ముతున్నాయి. ఎలుగుబంటి చర్మంతో చేసిన నల్లని అంగీని ధరించిన షామాను (పూజారి) ఆ మంట ముందు నిలబడి యేవో మంత్రాలను చదువుతున్నాడు.

లేడీ, దుప్పి, కణుజూ, ఎనుబోతూ, అడవి గుర్రం ఇలా జాతి కొక్క జంతువు చొప్పున ఆ దేవతకు బలి యిచ్చారు. బలి పశువుల మెడలనుండి కారుతున్న రక్తాన్ని పెద్ద, పెద్ద రాతి చిప్పలలో పట్టి దానినే తీర్థంగా ఆ ఆటవికులకు పంచారు షామాను శిష్యులు.

ఆ తరువాత ఆ జంతు కళేబరాలను మండుతున్న ఆ సెగడులో వేశారు. కాలుతున్న మాంసం వాసన ఆ ప్రాంతాన్నంతా కమ్మేసింది.

షామాన్ తన చేతిలోని శంఖాన్ని గట్టిగా ఊదాడు. చర్మపు డోల్లూ, కొమ్ము బూరలూ ఒక్కసారిగా మ్రోగటం ప్రారంభించాయి.

కర్ణ కఠోరంగా విన్పిస్తున్న ఆ సంగీతానికి అనుగుణంగా మరింత వికృతంగా నాట్యం చేయసాగారు వారు. వారి చేతులలోని ఈటెలు ఒక్కసారిగా పైకి లేచాయి. నాట్యం చేస్తూనే వారు పరుగెత్తుకుంటూ వచ్చి ఆ సెగడును చుట్టుముట్టారు.

ముందుగా నాయకుడు తన చేతిలోని ఈటెను ఆ సెగడులో గ్రుచ్చాడు. మరుక్షణం, మిగిలినవారంతా తమ, తమ ఈటెలను ఆ మంటలో గ్రుచ్చారు.

మంటలో బాగా కాలి, వ్రేల్చి వున్న జంతువుల మాంసపు ఖండాలు వారి ఈటెలకు గ్రుచ్చుకున్నాయి ఆనందంగా అరుచుకుంటూ, ఆ కాలిన మాంసాన్ని

ఆబగా తినసాగారు.

కావల్సినంత మదిర ....మాంసం....ప్రక్కనే మిస, మిసలాడుతున్న మగువలు....ఇంకేం కావాలి వారికి. ఆ రాత్రంతా వారు అలా....ఆడుతూ, పాడుతూ....ఆనం దంగా గడిపేస్తారు.

స్త్రీ, పురుషులు జంటలుగా ఏర్పడి నాట్యం చేయ సాగారు. నీరా, లాంబ్‌లు ఒక జంటగా ఏర్పడ్డారు. సారాయి మత్తులో అంతా తూలుతున్నారు.

తమను యెవరూ గమనించటం లేదని నిశ్చయించు కున్నాక వారు మెల్లగా చీకట్లోకి నడిచారు. ఒకవేళ యెవరైనా చూసినా "కోరికను ఆపుకోలేని జంటలే" అనుకుంటారు.

అక్కడనుండి బయటపడ్డాక వారు అడవిలో పరు గెత్తడం ప్రారంభించారు. వారి లక్ష్యం తప్పించుకు పారిపోవడం కాదు—నీరా తండ్రి డాక్టర్ మోహన్ ఉనికిని తెలుసుకోవడం.

రెండు రోజుల క్రితం ఇద్దరు ఆటవికులు మాట్లాడు కుంటున్న మాటలను ఆలకించాడు లాంబ్. నీరా పుణ్యమా అని అతడికీ కొంత ఆటవిక భాష వచ్చింది. ఆపైన రోజూ ఆటవికులు యిస్తున్న ట్రయినింగ్ అతడికి మరింత సహాకరించింది.

'ఆ దీవికి ఉత్తరాన అద్భుతమైన వన మూలికలు వున్నాయనీ, వాటి గాలి సోకితే అసలు రోగాలే రావని' అన్నాడొకడు.

'ఆ ప్రాంతం కేసు ఎత్తితే నాయకుడు తల తీయి స్తాడు. ఎక్కడయినా నోరు జారేవు జాగ్రత్త' అని మందలించాడు మరొకడు.

ఆటవికులకు కూడా తెలియకూడని ఆ రహస్య ప్రదేశంలోని ప్రత్యేకత ఏమిటి?

ఒకసారి మాటల సందర్భంలో నీరా అంది: 'వశీకరణ పసరును యెక్కడినుండో నాయకుడే తెస్తాడు. ఆ ప్రదేశం యెవ్వరికీ తెలియదు.'

నాయకుడు వశీకరణ పసరును తెచ్చే స్థలమూ, పరులెవరికీ తెలియకూడని ఉత్తర దిక్కులోని అద్భుత మూలికల వనమూ ఒక్కటే అయితే, నీరా తండ్రిని దాచిన స్థలమూ అదే అయి వుండాలి.

అందుకే వారు ఉత్తర దిక్కుగా వేగంగా పరుగెడుతున్నారు.

12

ఏపుగా ఎదిగిన ఆలివ్, ఓక్, సాల్ వృక్షాలూ, వాటి కొమ్మలకు ప్రాకిన చిత్ర, విచిత్రమైన లతలూ, చుట్టూ పొదలూ, లతా నికుంజాలూ ....ఎంతో మనోజ్ఞంగా వుంది ఆ ప్రదేశం.

ఆ వనం మధ్య నిర్మింపబడ్డ విశాలమైన కుటీరం ముందున్న పెద్ద బండపై కూర్చుని వున్నారు ఇద్దరు ఆటవికులు. వారికి దూరంగా గూడెంలో అమ్మవారి జాతరలో మ్రోగుతున్న చర్మపు డోళ్ళ శబ్దం వినిపిస్తూంది.

ఆ ఆనందంలో పాలు పంచుకోలేని తమ దురదృష్టానికి వగస్తున్నారు వారు.

"పనికిమాలిన ఈ కాపలా పని తగలకుంటే హాయిగా జాతరలో చిందులేస్తూ వుండేవారం ఈపాటికి" బాధగా నిట్టూరుస్తూ అన్నాడొకడు.

అతడి వంక జాలిగా చూశాడు రెండవవాడు, డప్పుల మ్రోత వింటున్న కొద్దీ....ఒక్కసారి జాతరను చూసి

రావాలన్న కోరిక క్షణ, క్షణానికీ వారిలో అధికం కాసాగింది.

అకస్మాత్తుగా వారిలో ఒకడికి అద్భుతమైన ఆలోచన వచ్చింది. మెరుస్తున్న కళ్ళతో తన సహచరుడ్ని చూశాడు.

"ఈ ముసలివాడ్ని కాపలా కాయడానికి ఇద్దరు యెందుకురా? నీ వొక్కడివే ఉండు. నేను వెళ్ళి ఒకసారి కన్నులారా జాతరను చూసి వస్తాను. నేను వచ్చాక నీవు జాతరకు వెళ్ళుదువు గాని, అప్పుడు నేను కాపలా ఉంటాను."

అతడి ఆలోచనకు ఆనందంగా తలూపాడు రెండవ వాడు. ఛెంగున దూకుతుంటూ అడవిలోనికి పరుగెత్తాడు.

అంతవరకూ ఒక పొద చాటున దాక్కొని, ఆ ఇద్దరు ఆటవికుల మాటలనూ ఆలకిస్తున్నారు లాంబ్, నీరా. లాంబ్ మస్తిష్కం చురుగ్గా పనిచేయసాగింది.

"మళ్ళీ ఆ ఆటవికుడు వచ్చేలోగానే తాము యేదో ఒకటి చేయాలి. వారి మాటలనుబట్టి డాక్టర్ మోజస్ వుంటున్నది ఈ కుటీరంలో నేనని తెలుస్తూంది."

సరిగ్గా రెండు నిమిషాల తరువాత అతడి మెదడుకు తట్టిందొక అద్భుతమైన ఆలోచన. ఒక్కసారి తన ఆకారం వంక చూసుకున్నాడు. జాతర సందర్భంగా అతడి శరీరం నిండా వింత, వింత రంగులను పులిమారు. మెడలో పూసల పేర్లూ, మొలకు కట్టుకున్న చిన్న చర్మపు గోచీ. అచ్చం ఆటవికుడిలాగానే వున్నాడతడు.

ఒక నిశ్చయానికి వచ్చినట్లు అతడు పొదల చాటు నుండి బయటకు నడిచాడు. కడుపును రెండు చేతులతో పట్టుకొని బాధగా అరుస్తూ....ఆ ఆటవికుడ్ని సమీ

పించాడు.

ఇప్పుడే వెళ్ళిన తన మిత్రుడు గోడకు కొట్టిన బంతిలా అప్పుడే వచ్చేశాడేమిటా అని ఆశ్చర్యపోయాడు. లాంబ్ ను తన సహచరుడిగానే భ్రమిస్తున్నాడతడు.

మోకాళ్ళమీద ముఖాన్ని దాచుకున్నాడు లాంబ్. గొంతులో బాధను కొని తెచ్చుకుంటూ మెల్లగా అన్నాడతడు.

"అకస్మాత్తుగా తనకు కడుపునొప్పి పట్టుకుందనీ, గూడెంవరకూ వెళ్ళలేనని తాను అక్కడ కాపలా ఉంటానని అతడిని జాతర చూడటానికి వెళ్ళమని" చెప్పాడు లాంబ్.

జాతరపట్ల ఆకర్షణ ఆ ఆటవికుడ్ని గుడ్డివాణ్ని చేసింది. లాంబ్ మాటలను నమ్మి, మిత్రుని స్థితికి విచారిస్తూనే అతడు జాతరవైపు బయలుదేరాడు.

ఆ ఆటవికుడు కనుమరుగయ్యాక, నీరా పొదలలో నుండి పైకి వచ్చింది. వారిద్దరూ కలసి ఆ కుటీరాన్ని సమీపించారు.

జాతరను చూడటానికి వెళ్ళిన ఆటవికులు, ఒకరినొకరు చూసుకొని నిజాన్ని గ్రహించి, తిరిగి వచ్చేసరికి ఎంత లేదన్నా ఒక గంట పడుతుందని, ఆ గంటలోపలే తమ పని పూర్తిచేసుకోవాలనీ లాంబ్ కు తెలుసు.

నీరా మెల్లగా తలుపుతట్టి, తండ్రిని పిలిచింది. నిద్రపోతున్న మోజెస్....కూతురు గొంతు విని ఉలిక్కిపడి లేచాడు. ఒక్కక్షణంపాటు కలో....నిజమో అతడికి అర్థంకాలేదు.

కాని....తలుపు దగ్గర కూతురు స్వరం స్పష్టంగా విన్పిస్తూండేసరికి ఒక్క ఉదుటున పక్కమీదనుండి లేచి

తలుపులను తెరిచాడు. ఎదురుగా యెవరో అపరిచిత యువకుని ప్రక్కన నిలబడి వున్న నీరాను చూసేసరికి ఆనందంతో అతడి కళ్ళు చెమర్చాయి.

"నాన్నా!" అని బావురుమంటూ తండ్రి గుండెలపై వ్రాలిపోయి వెక్కి వెక్కి యేడ్వసాగింది నీరా. ఆమె తల నిమురుతూ కొన్ని క్షణాలసేపు అలాగే వుండిపోయాడతడు.

కాసేపటికి ఆ తండ్రీ, కూతుళ్ళిద్దరూ తేరుకున్నారు. లాంబ్‌ను తండ్రికి పరిచయం చేసిందామె. వారు ముగ్గురూ కలసి ఆ అదృశ్య దీవులను గూర్చి చర్చించుకున్నారు. కాని, ఎంత ఆలోచించినా ఆ దీవులనుండి బయటపడే మార్గం కన్పించలేదు వారికి.

చివరకి మోజస్ ఇలా అన్నాడు.

"లాంబ్! ఈ దీవులనుండి తప్పించుకోవడానికి నాకు ఒకే మార్గం కన్పిస్తూంది."

"ఏమిటది డాక్టర్" ఆత్రంగా అన్నాడు లాంబ్.

"ఈ దీవులలో జరుగుతున్న గంజాయి, నల్లమందు వ్యాపారాన్ని గురించీ, సముద్రపు దొంగతనాల గురించీ ఎలాగైనా చిలీ ప్రభుత్వానికి తెలియజేయాలి. ప్రభుత్వావికాదళం రంగంలోనికి దిగి ఈ చీడపురుగుల్ని అన్నింటినీ ఏరి పారేయాలి. అప్పుడే మనకు విముక్తి" బాధగా నిట్టూరుస్తూ అన్నాడు మోజస్.

మోజస్‌ను జాగ్రత్తగా వుండమని చెప్పి, లాంబ్, నీరాలు వెళ్ళిపోవడానికి ఉద్యుక్తులయ్యారు. ఒక్క నిమిషం వారిని ఆగమని చెప్పి, చిన్న భరిణెను తీసుకు వచ్చాడు మోజస్. దానిని లాంబ్‌కు యిచ్చాడు.

"లాంబ్! ఈ భరిణలోని మూలికాభస్మం చాలా

ప్రమాదకరమైనది. కుండెడు ద్రవంలో చిటికెడు భస్మాన్ని కలిపినా చాలు. ఆ ద్రవాన్ని త్రాగినవారంతా తెలివితప్పి పడిపోతారు. మళ్ళీ పన్నెండు గంటలవరకూ ఆ మత్తులో నుండి లేవలేరు. మోతాదు మించిందా ప్రాణాలకే ప్రమాదం. జాగ్రత్తగా వుంచు. దేనికైనా పనికొస్తుంది."

మోజెస్ వంక కృతజ్ఞతగా చూశాడు లాంబ్. అతడి దగ్గర శలవు తీసుకొని అడవిలోనికి నడిచారు వారు. లాంబ్ మనసులో ఒకటే ఆలోచన.

"ఈ దీవుల రహస్యాన్ని .... చిలీ ప్రభుత్వానికి తెలియచేయాలి. కాని ఎలా? ....ఎలా?"

లాంబ్, నీరాలు వెళ్ళిపోయిన పది నిమిషాలకు తిరిగి వచ్చారు ఆ ఆటవికులు. ఎవరో తమను మోసం చేశారన్నది వారికి స్పష్టంగా తెలుస్తూంది. ఆత్రంగా వచ్చి కుటీరంలోనికి తొంగి చూశారు. నిద్రపోతున్న మోజస్‌ను చూశాక వారి గుండెలు చల్లబడ్డాయి.

తాము మోసం చేయబడ్డామన్న విషయాన్ని వారు తమలోనే దాచుకున్నారు. అది బయటపెడితే కాపలా వదలి వెళ్ళినందుకు వారికి విధించబోయే శిక్షేమిటో వారికి తెలుసు. అది: మరణశిక్ష.

గూడెం చేరిన లాంబ్, నీరాలూ యేమీ ఎరగనట్లు జాతరలో చిందులేస్తున్న మిగిలిన జంటల్లో కలిసిపోయారు.

13

ఆ రోజు నుండీ లాంబ్ మనసునిండా అదే ఆలోచన "ఎలా ఈ రహస్యాలను బయట ప్రపంచానికి తెలియజేయడం?" అతడు తన ప్రయత్నాలను ప్రారంభించాడు.

ఒక జింక చర్మాన్ని సంపాదించి, శుభపరచి ఉంచాడు. దీర్ఘ చతురస్రాకారంలో కత్తిరించాడు. ఇప్పుడది ఆటవికులు మొలకు ధరించే చర్మపు గోచీలా వుంది. ఆటవికులు ముఖాలకు రాసుకునే రంగులను చిన్న, చిన్న రాతిచిప్పలలో సేకరించి వుంచాడు. రెండు మూడు పక్షి ఈకలను కూడా సిద్ధం చేసుకున్నాడు.

అన్నీ సమకూర్చుకున్నాక, ఒక రాత్రి అంతా నిద్ర పోయాక గుడిసెలో కూర్చుని ఆ చర్మపు ముక్కపై, పక్షి ఈకను రంగులలో ముంచి నెమ్మదిగా వ్రాయడం ప్రారంభించాడు.

అతడు వ్రాస్తున్నది.... చిలీ దేశపు అధ్యక్షుని పేర సంబోధించబడ్డ లేఖ. అందులో ఆ అదృశ్యదీవులలో జరుగుతున్న చట్టవిరుద్ధమైన కార్యకలాపాల గురించీ, తనకు తెలిసినంతలో ఆ దీవుల నైసర్గిక స్వరూపం గురించి వివరంగా వ్రాశాడు.

డాక్టర్ మోజస్ సూచన ప్రకారం, ప్రభుత్వ నావికాదళం ఒక పెద్ద పటాలంతో బయలుదేరి ఆ దీవులను ముట్టడిస్తేగాని ఈ అదృశ్య దీవులను ఆక్రమించడం సాధ్యంకాదని స్పష్టం చేశాడతడు.

ఆ చర్మపు ముక్కను మామూలుగా తన మొలకు ధరించాడు. అప్పటినుండీ.... 'ఎప్పటికయినా అవకాశం రాకపోతుందా, ఆ చర్మపు లేఖను బాహ్య ప్రపంచానికి అందించకపోతానా' అని ఆత్రంగా ఎదురుచూడసాగాడు.

సరిగ్గా పదిరోజుల తరువాత అతడి నిరీక్షణ ఫలించింది. ఆ రోజు రాత్రి తొలి జాములో వారికి సంకేతం అందింది. 'పసిఫిక్ సముద్రంలో దోనాన్ దీవులకు సమీ

పంగా యేదో నాక వస్తోంది' వెంటనే ఆ ఆటవికులు ఆ ద్వీపంనుండి బయలుదేరారు. ఈసారి వాళ్ళతో పాటు గోవర్, లాంబ్ లుకూడా వున్నారు.

గోవర్ కూ, లాంబ్ కూ ఇది మొదటి అనుభవం కనుక వారు తీసుకోవల్సిన జాగ్రత్తలను మరోసారి చెప్పి వారిని హెచ్చరించారు ఆ ఆటవికులు.

సముద్రపు జలాలలో నిండా మునిగి, చేపపిల్లల్లా ఈదుకుంటూ వారంతా షిప్ దగ్గరకు చేరుకున్నారు. ఆ చీకటిలో వాళ్ళు మరింత నల్లగా జలభూతాల్లా వున్నారు. ఇద్దరు ఆటవికులు తమ భుజాలపై వున్న ఉడుములను చేతులలోనికి తీసుకున్నారు. వాటి మూతులకు తేనెను వ్రాసి....షిప్ బాడీపై వదిలారు. అవి చక, చాకా ప్రాకుకుంటూ పైకి యెక్కాయి.

ఉడుములు షిప్ డెక్ ను చేరుకున్నాయని నిశ్చయించు కున్నాక వాటి నడుములకు కట్టబడ్డ త్రాళ్ళను ఎవరో లాగుతున్నారని గ్రహించగానే ఆ ఉడుములు షిప్ డెక్ ను గట్టిగా పట్టుకున్నాయి. యిక పదిమంది మనుషులు కూడా ఆ పట్టును విడిపించలేరు. దానినే ఉడుంపట్టు అంటారు.

మొదటగా ఇద్దరు ఆటవికులు ఆ త్రాళ్ళను పట్టుకొని పైకి ఎగబ్రాకారు. డెక్ పైకి చేరుకున్న వెంటనే అక్కడ వున్న డ్రమ్స్ చాటుకు డైవ్ చేశారు. డెక్ మీద చిందరవందరగా పడి వున్న సామానుల చాటు నుండి మెల్లగా ప్రాకుకుంటూ ఇంజన్ రూమ్ ను సమీపించారు.

ఇద్దరు సెయిలర్స్ వున్నారు ఆ ఇంజను రూములో. మెల్లగా గదిలోనికి ప్రవేశించి, ఒక్కసారిగా చిరుత

పులుల్లా ఆ కెయిలర్స్ మీదకు దూకారు ఆ ఆటవికులు. ఒక చేత్తో వారి నోళ్ళను మూస్తూ, మరొక చేతితో బలంగా వారి మెడనరాలపై గుద్దారు.

మెడనరాలు కమిలిపోయి, మనిషిని పారలైజ్ చేసే పురాతనమైన టెక్నిక్ అది. స్పృహతప్పి పడిపోయిన కెయిలర్స్‌ను క్రింద పడుకోనబెట్టి, జనరేటర్‌ను సమీపించారు.

జనరేటర్ స్విచ్ ఆఫ్ చేసిన వెంటనే ఒక్కసారిగా షిప్ అంతా అంధకారం అలుముకుంది. ఏం జరిగిందో తెలియక, షిప్ అంతా హాహాకారాలు మొదలయ్యాయి.

అప్పటికే డెక్ మీదకు చేరుకొని, డ్రమ్స్ వెనుక దాక్కొని వున్న ఆటవికులు మెరుపువేగంతో కదిలారు. కొందరు స్టోర్ రూమ్‌మీద దాడిచేశారు.

డెక్ మీద కూర్చుని వున్న ప్యాసెంజర్లలో బలమైన యువకులనూ, అందమైన యువతులనూ ముందే డ్రమ్స్ చాటున కూర్చుని గమనించి, గుర్తుపెట్టుకోవడంచేత మరి కొందరు చప్పుడు కాకుండా ఆ ప్యాసెంజర్ల చెంతకు చేరారు.

అరచేతులతో మెడలపై చరిచి వారిని పారలైజ్ చేయడం.... క్రిందకు వ్రాలిపోతున్న వారిని భుజాలకెత్తుకొని త్రాడు సాయంతో క్రిందికి దిగిపోవడం, అంతే!

అడవిలో ఎండుటాకులమీద సైతం పాదాల చప్పుడు కాకుండా నడవగలిగే ఆటవిక జాతివారిది. కనీసం వారి అడుగుల చప్పుడు కూడా యెవరికి వినిపించలేదు.

సరిగ్గా పదిహేను నిమిషాలలో వారి దోపిడీ పూర్తయిపోయింది.

షిప్ సిబ్బంది ఎలర్టు అయి, ఆ చీకటిలో తడుముకుంటూ జనరేటర్ రూముకు చేరుకొని, జనరేటర్‌ను ఆన్ చేసేలోపల ఆ ఆటవికులు సముద్రంలోకి వురికి దోనాన్ దీవుల పాయల్లోనికి చొచ్చుకుపోయారు.

పోయిన సామగ్రిని, అదృశ్యమయిన ప్యాసెంజర్లను లెక్క వేయసాగాడు షిప్ కెప్టెన్ ఎడ్మండ్స్.

స్టోర్ రూమును చెక్ చేస్తున్న కెప్టెన్ ఎడ్మండ్స్ దృష్టిని అక్కడ పడివున్న చర్మపు ముక్క ఆకర్షించింది. నీళ్ళల్లో తడిసినట్లు వుంది అది. కాని దానిమీద వ్రాయబడ్డ రంగు రంగుల అక్షరాలు మాత్రం మిల, మిలా మెరుస్తున్నాయి.

అది ... లాంబ్ వ్రాసిన చర్మపు లేఖ.

స్టోర్ రూముకు మిగిలిన ఆటవికులతో పాటు దోపిడీకి వచ్చిన అతడు కెర్పాగా ఆ చర్మపు లేఖను అక్కడ జారవిడిచాడు. తాము ముఖాలకు పూసుకునే ఆ రంగులు నీటిలో తడిసినా చెరగవని అతడికి తెలుసు.

కెప్టెన్ ఎడ్మండ్స్ ఆ లేఖను చేతిలోనికి తీసుకున్నాడు. అది చదువుతున్నకొద్దీ ఆశ్చర్యంతో అతడి కళ్ళు పెద్దవయ్యాయి. అదృశ్యదీవులలో జరుగుతున్న దురాగతాలను చదువుతూ భయంతో వణికిపోయాడతడు.

ఆ లేఖ చివర....లాంబ్ ఒక అభ్యర్థనను కూడా వ్రాశాడు. "ఈ లేఖ ఎవరికి లభించినా దయచేసి దీనిని చిలీ దేశపు అధ్యక్షునికి చేరేలా చూడండి. ఈ లేఖపై కొన్ని వందలమంది జీవితాలు ఆధారపడి వున్నాయి."

కెప్టెన్ ఎడ్మండ్స్....ఆ లేఖను ఫస్టు సెక్రటరీ టు ది ప్రెసిడెంట్ ఆఫ్ చిలీకు అందజేశాడు. అతడికి మొదట ఆ సెక్రటరీతో ఇంటర్వ్యూ దొరకటమే కష్టమై

పోయింది.

కాని.... దోనాన్ దీవులకు సంబంధించిన ఒక రహస్య సమాచారం తన దగ్గరుందని చెప్పడంతో అతడు ఆ సెక్రటరీని కలుసుకో గలిగాడు.

సెక్రటరీ తీసుకువచ్చిన ఆ చర్మపు లేఖను చదివిన చిలీ దేశపు అధ్యక్షుడు దిగ్భ్రమ చెందాడు.

14

తూరుపు తల్పంపై అరుణుడు బద్ధకంగా కళ్ళు విచ్చు కుంటున్న వేళ. దినకరునికి సుప్రభాతం పలుకుతున్నాయా అన్నట్లు అడవి అంతా పక్షుల కిలకిలారావాలతో నిండి పోయింది.

ఆ రోజు ఉదయంనుండీ దోనాన్ దీవులలో ఒక విధమైన సంచలనం బయలుదేరింది. అన్ని దీవులలోని ఆటవికులూ కట్టకట్టినట్లుగా గుంపులుగా బయలుదేర సాగారు. ప్రతి ఒక్కరూ రాత్రికి కావాల్సిన ఆహా రాన్ని మూటకట్టి పట్టుకున్నారు.

చిన్న, చిన్న డింగీలలోనూ, తెప్పలలోనూ ప్రయా ణిస్తూ ఒక క్రొత్త దీవిని చేరుకున్నారు. ఆ దీవిని చూడటం లాంబ్ కూ, గోవర్ కూ అదే మొదటిసారి.

నీరా, చేయి పట్టుకుని లాంబ్ నడుస్తున్నాడు. ఇంకొక యువతి గోవర్ ను నడిపిస్తూంది. అత్యంత ప్రాచీన మైన దుర్గమారణ్యం ఆ దీవి అంతటా పరచుకొని వుంది.

'ఆ రోజు దేవదూత వస్తాడట. ఆ ఆటవికులను ఉద్దే శించి ప్రసంగిస్తాడట' అదీ సంరంభానికి కారణం.

నీరా కూడా ఒకసారి ఆ దీవిని చూసింది. కాని దేవ దూతను చూడటం ఆమెకూ ఇదే మొదటిసారి అవు తుంది. వారి మనసుల్లో యేదో ఉత్కంఠ.

వారంతా ఒక ఎత్తయిన కొండను సమీపించారు. అది చిన్న సైజు పర్వతంలా వుంది. వివిధ రకాలయిన చెట్లూ, పొదలూ ఆ కొండనిండా గుబురుగా పెరిగి వున్నాయి.

ఆటవికులంతా ఆ పర్వత పాదంలో గుమికూడారు. కొంతమంది గొడ్డళ్ళతో పెద్ద, పెద్ద ఎండు మ్రానులను నరికి పెద్ద గుట్టగా పోశారు. చీకటిపడే సమయానికి ఆ మ్రానులకు చెకుముకి రాళ్ళతో నిప్పును చేసి ముట్టించారు. వారంతా ఆ మంట చుట్టూ చేరారు.

సన్నని పొగమంచు దట్టంగా అంతా వ్యాపించి వుంది. మంచుతో చల్లబడుతున్న దేహాలకు చలిమంట వేడెక్కిస్తూంది.

తాము తెచ్చుకున్న ఆహారాన్ని తిని, హాయిగా తలా కాస్త దాహాసవాన్ని పుచ్చుకున్నారు వారు.

రాత్రి తొలిజాము గడిచింది. ఒక్కసారిగా ఎదురుగా నున్న కొండమీద భేరీ నాదం వినిపించింది. మరుక్షణం నాగస్వరం విన్న నాగుల్లా ఆ ఆటవికులంతా చివుక్కున తలలెత్తి ఆ కొండవైపు చూశారు.

ఒక్కసారిగా ఆ కొండమీద మెరుపు మెరిసినట్లయింది. కన్నులు మిరుమిట్లు గొలిపే కాంతి ఒక్కసారిగా జ్వాలా పుష్పంలా విచ్చుకుంది. ఆ తరువాత తెల్లని దట్టమైన పొగ ఆ శిఖరంనుండి ఆకాశానికి ఎగిసింది.

ఆ శ్వేత ధూమంలోనుండి వస్తున్న ఆజానుబాహుడ్ని చూడగానే ఆ ఆటవికులు హాహాకారాలు చేశారు. నేలపై మోకరిల్లి నమస్కరించారు.

అతడు పచ్చగా బంగారంలా మెరుస్తున్న పొడవైన అంగీని ధరించాడు. తలపై వజ్రాల కిరీటం ధగ, ధగ

లాడుతూంది. తెల్లగా వెండిలా మెరుస్తున్న గడ్డం గుండెలపై జీరాడుతుంది. అతడి ఎడిచేతిలో బంగారు దండం వుంది. నెమ్మదిగా నడుచుకుంటూ కొండ దిగ సాగాడు అతడు.

నీరవ నిశీధిలో, తెలిమంచు తెరలను తొలగించుకుని, పసిడి కాంతులీనుతూ .... దివినుండి దిగివచ్చిన దేవదూత లాగానే వున్నాడతడు.

కొండనుండి దిగివచ్చి అక్కడున్న ఎత్తయిన శిలా వేదికపై నిలుచున్నాడతడు. మంటల వెలుగులో ఇప్పు డతని రూపం స్పష్టంగా కన్పిస్తూంది. అతని ముఖం వంక చూశారు లాంబ్, నీరాలు.

అంతే! కరంట్ షాక్ తగిలినట్లయింది వారికి.

ఆ దేవదూత ఎవరో కాదు. గ్రాహాం పాల్. ఎవరి నైతే దోనాన్ దీవులలో ప్రవేశించడానికి.... అందరూ సలహాలను అడుగుతుంటారో.... ఆ పాస్టర్ .... ఫాదర్ గ్రాహాంపాల్ అతను.

"ఇతడా .... ఈ ఆటవికుల్ని అందరినీ కలిపి ఈ అత్యాచారాలు చేయిస్తున్నది? ఇతడా అందమైన ఈ దోనాన్ దీవులను రాక్షస దీవులుగా మార్చింది?"

ఎంతో దయామయుడిలా తమను ఆ దోనాన్ దీవుల లోనికి వెళ్ళకద్దని వారించిన ఫాదర్ గ్రాహాం పాల్ ఈ అక్రమాలన్నింటినీ చేయిస్తున్నాడంటే నీరా నమ్మలేక పోతూంది.

"ఎలా....? ఎలా ఇతడు ఈ ఆటవికుల్నందర్నీ వశ పరచుకున్నాడు?" లాంబ్ మెదడును తినేస్తున్న సందేహం అది.

అతడి సందేహానికి సమాధానం చెబుతున్నట్లుగా

గ్రాహం పాల్ తన ప్రసంగాన్ని ప్రారంభించాడు.

"బిడ్డలారా! దేవుని తరఫున మీకు ఆశీస్సు లందిస్తున్నాను.

ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన నాగరికత గల తెగలకు చెందిన వారు మీరంతా.

అలాంటి మిమ్మల్ని, ఒక శతాబ్దం క్రితం నాగరిక వాసులమని విర్రవీగే ఈ ఆధునికులు బంధించి తమ దేశాలకు తీసుకొనిపోయి బానిసలుగా మార్చి తమ సేవలకు వినియోగించుకున్నారు.

ఆనాడు మీ పూర్వీకులకు జరిగిన అన్యాయానికి ప్రతీకార చర్య.... ఈ దోనాన్ దీవులలో.... ప్రాచీన ఆటవిక రాజ్య స్థాపన.

ఆఫ్రికా ఖండంలోని ఈజిప్షియన్లు, మధ్య ఆసియాలోని మంగోలులు, దక్షిణ అమెరికాలోని రెడ్ ఇండియన్లు.... ఇలా ఆయా జాతులవారంతా పూర్వం ఆ ఖండాలను ఏకచ్ఛత్రాధిపత్యంతో ఏలిన వారే.

మరి.... ఇప్పుడు వీరంతా యెందుకు అనామకుల్లా పడి వున్నారు? మొన్న, మొన్న కన్ను తెరిచిన ఈ ఆధునిక వాసులు మిమ్మల్ని, మీ నాగరికతనూ అట్టడుగుకు అణిచివేశారు.

అందుకే ఈ ప్రతీకారం.

ఏ ఆధునికులు మిమ్మల్ని బానిసలుగా చూశారో.... ఆ ఆధునికుల్ని పట్టి బంధించి, మన బానిసలుగా మార్చుకోవడమే మన లక్ష్యం!

మన ఈ ప్రయత్నానికి దేవుని దీవెన ఉంది.

విజయీభవ!"

తన ప్రసంగాన్ని ముగించి, గ్రాహం పాల్ మళ్ళీ

కొండమీదకు వెనుతిరిగిపోయాడు. గూడెం నాయకుడు అతిడిని అనుసరించాడు.

గ్రాహాంపాల్ ఉపన్యాసం విన్న వెంటనే తన సందేహాలన్నీ పటాపంచలయినట్లనిపించింది లాంబ్ కు.

"గత చరిత్ర చెప్పి, నాగరికులమీద ప్రతీకారం అన్న సాకుతో ఈ ఆటవికుల్ని అందరినీ లొంగదీసుకున్నాడన్నమాట" అనుకున్నాడు లాంబ్.

మరునాడు రాత్రి....దోనాన్ దీవుల మధ్యకు చొచ్చుకొని వచ్చాయి మూడు మర పడవలు.

ఓడలలో దొంగలించిన సామగ్రిని, గంజాయితో నింపబడిన సంచులనూ ఆ మర పడవలలోనికి ఎక్కించారు ఆ ఆటవికులు.

"ముందు రోజు రాత్రి గ్రాహాంపాల్ రాకలోని అంతరార్థం ఇదన్నమాట" అనుకున్నాడు లాంబ్ బోట్స లోనికి సామానులను చేరవేస్తూ.

అతని మనసునిండా ఒకటే ఆలోచన.

తన ఉత్తరం చిలీ ప్రెసిడెంట్ కు చేరిందా? దానిని అతడు సీరియస్ గా తీసుకున్నాడా? తీసుకుంటే తాను సూచించినట్లు దోనాన్ దీవులమీద ఎటాక్ ప్రారంభం కావాలి.

ఆ అదృష్ట దినం కోసం ఎదురు చూస్తున్నాడు అతను.

15

సరిగ్గా మూడు రోజుల తరువాత అతడి నిరీక్షణ ఫలించింది.

చిలీ దేశపు రక్షణశాఖ నౌక 'స్టీల్ వేల్' దోనాన్ దీవులను సమీపించిందన్న వార్త ఆ దీవులలో కార్చిచ్చులా వ్యాపించింది. ఆ ద్వీపవాసులందరూ ఆయుధా

లతో సిద్ధమయ్యారు.

అంత పెద్ద నౌక.... ఆ దీవులమధ్య నున్న చిన్న కాలువలోనికి రాలేదని వారికి తెలుసు. సైనికులు వచ్చే చిన్న చిన్న స్టీమ్ బోట్స్‌లో రావాలి. డోనాన్ దీవుల సముదాయంలోనికి ఆ బోట్స్ వచ్చిన మరుక్షణం ... పద్మవ్యూహంలాంటి ఆ దీవులమధ్య దారి తప్పడం ఖాయం. దారి తప్పిన ఆ సైనికులను మట్టుపెట్టడం వారికి చిటికలమీద పని అదీ ...ఆ ఆటవికుల భరోసా.

అయితే ఈసారి వారు ఊహించినట్లుగా ముట్టడి భూతలం మీదినుండి జరుగలేదు. గగన తలంమీదనుండి సాగింది.

విమాన వాహక నౌక అయిన 'సీల్ వెల్' నుండి ఒక్కసారిగా మూడు విమానాలు పైకి ఎగిరాయి. ఆకాశంలో గ్రద్దలా చక్కర్లు కొడుతున్న వాటి వంక విచిత్రంగా చూశారు ఆ ఆటవికులు.

గగన తలంలో ఒక నిర్ణీతమైన ఎత్తుకు చేరుకున్నాక ఆ విమానాలకున్న ఎమర్జన్సీ డోర్స్ తెరవబడ్డాయి. వీపులకు పారాచ్యూట్ కిట్స్‌తో ఒక్కరొక్కరుగా క్రిందకు దూకారు చిలీ దేశపు సైనికులు.

శూన్యంలో కొన్ని అడుగులు అలా డెస్పరేట్‌గా క్రిందకు జారాక ఒక్కసారిగా వారి వీపులకున్న పారాచ్యూట్స్ విచ్చుకున్నాయి.

రంగు, రంగు బుట్టలను పట్టుకొని ఆకాశంనుండి దిగుతున్న ఆ సైనికులను చూసి ఆటవికులు విభ్రాంతిపోయారు.

పారాచ్యూట్స్ క్రిందకు వ్రాలాయి. భుజాలకున్న వాటి బెల్టులను విప్పదీసుకుంటున్నారు సైనికులు.

నేలమీదకు వ్రాలిన సైనికులను చూడగానే ఆ

ఆటవికులకు ధైర్యం వచ్చింది. గట్టిగా అరుచుకుంటూ వారిని చుట్టుముట్టారు.

మరుక్షణం ఆ సైనికుల చేతులలోని స్టెన్‌గన్స్ భయంకరంగా గర్జించాయి. గుండెల్లో గుళ్ళు దూసుకు పోతుంటే బాధగా అరుస్తూ .... పిట్టల్లా, నేలకూల సాగారు ఆ ఆటవికులు.

ఒక చెట్టుచాటునుండి ఇదంతా చూస్తున్న లాంబ్ కళ్ళు చెమర్చాయి.

ఒక నరరూప రాక్షసుని స్వార్థానికి, అతడి వికృత ఆలోచనలకూ అమాయకులైన ఈ ఆటవికులు బలైపో తున్నారు.

కాని ఈ మారణకాండ తప్పదని అతడికి తెలుసు. నాగరిక ప్రపంచంమీద నిలువెల్లా క్రోధాన్నీ, పగనూ పెంచుకున్న ఆ ఆటవికుల్ని సమూలంగా నాశనం చేయక పోతే.... భవిష్యత్‌లో వారి వక్రపు ఆలోచన ప్రభా వంతో ప్రపంచంలోని మొత్తం ఆటవిక జాతులంతా నాగరికులమీద దాడులు చేసే ప్రమాదం వుంది.

లాంబ్ ప్రక్కనే అతడిని అనుకొని నీరా నిలబడి వుంది.

వారికి పది గజాల దూరంలో నున్న కుటీరంలో గోవర్‌తోసహా బ్రెయిన్ వాష్ చేయబడ్డ అమెరికన్ యువకులంతా స్పృహ తప్పి పడివున్నారు.

చిలీదేశపు రక్షణ నౌక దోనాన్ దీవులను సమీ పించిందన్న వార్త తెలిసిన వెంటనే డాక్టర్ మోజన్ ఇచ్చిన భస్మాన్ని దాహాపుకంలో కలిపి ఆ అమెరికన్ యువకులచేత త్రాగించాడు లాంబ్.

అలా వారిని స్పృహ తప్పించకపోతే, మతిలేని

సితిలో వారు కూడా ఆ ఆటవికులతో పాటుగా ఆ సైనికులను ఎదుర్కొని మరణించి వుండేవారని అతడికి తెలుసు.

సైనికుల చేతిలో చావగా మిగిలిన ఆటవికులు ప్రాణ భీతితో వెనక్కి పరుగెత్తారు. అడవికి అడ్డంపడి శర వేగంగా పరుగెత్తుతూ ఒడ్డుకు చేరుకున్నారు. సముద్రంలో మునిగి పారిపోవాలని వారి ఆశ.

కాని.... అప్పటికే స్టీమ్‌బోట్లతో ఆ దీవులను చుట్టుముట్టారు సైనికులు. ఒకటీ.... రెండూ కాదు....ఏభయి స్టీమ్‌బోట్లు ఆ దీవులలోని అన్ని కాలువలను కవర్ చేస్తుంటే ఒక్క ఆటవికుడు కూడా ఆ చక్రబంధంలో నుండి తప్పించుకుపోలేక పోయాడు.

చనిపోయినవారు పోను, మిగిలిన ఆటవికులు సైనికులకు లొంగిపోయారు. బానిసలుగా బ్రతుకుతున్న అమెరికన్ యువకులను తీసుకొని "స్టీల్ వేల్" వెనక్కి మరలింది.

ఉపసంహారం:

ఇన్నాళ్ళూ రాక్షస దీవులుగా అందరినీ భయభ్రాంతులను చేసిన దోనాన్ దీవులు చిలీ ప్రభుత్వ అధీనంలోనికి వచ్చాయి.

తనే ఈ అక్రమాలకు మూలపురుషుడినన్న రహస్యం బట్టబయలయిందని తెలియగానే ఫాదర్ గ్రాహంపాల్ ఆత్మహత్య చేసుకున్నాడు.

గోవర్‌తో సహా, వశీకరణ విద్య చేత మతిపోగొట్టుకున్న వారందరినీ తిరిగి మామూలు మనుషులను చేసే ప్రయత్నంలో పడ్డాడు డాక్టర్ మోజస్.

దోనాన్ దీవుల రహస్యాన్ని ఛేదించడంలో ఎంతో ధైర్యసాహసాలను ప్రదర్శించిన లాంబ్‌ను చిలీ దేశపు ప్రజలూ, ప్రభుత్వమూ, పత్రికలూ వేనోళ్ళ ప్రశంసించారు.

ఇక .... నీరా!

పదిరోజులలో, జరగబోతున్న తమ పెళ్ళి గురించి తీయని కలలు కంటూంది ఆమె.

తమ హనీమూన్ ట్రిప్ యెక్కడికో కూడా లాంబ్ చెప్పేసాడా మెకు. అతనెంచుకున్న స్థలం దోనాన్ దీవులు.

అవును మరి .... దోనాన్ దీవులు ఇప్పుడు రాక్షస దీవులు కావు.... ఇప్పుడు అక్కడ జల భూతాలు లేవు! ఆ దీవులు ఇప్పుడు ప్రేమికుల పాలిట నందనవనాలు.

—: అయిపోయింది :—